నవతెలంగాణ

మెదక్

1

బుధవారం | 30 అక్టోబర్ 2024 | www.navatelangana.com

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-సంగారెడ్డి

కంది, కొండాపూర్ మండలాలకు చెందిన లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు లను స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మె ల్యే చింతా ప్రభాకర్ మంగళవారం అంద జేశారు. కొండాపూర్‌కు సంబంధించి రూ.10,10000విలువ గల 34 చెక్కులు, కంది మండలానికి సంబంధించి రూ.852500 విలువ గల 29 చెక్కులను ఎమ్మె ల్యే పంపిణీ చేశారు. ప్రైవేట్, కార్పోరేట్ ఆసుప త్రిలో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బ ందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి , పార్టీ మండ లాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విఠల్, కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, కృష్ణ గౌడ్, మోహన్ రెడ్డి, పాండు, నగేష్ పాల్గొన్నారు.

ఆధ్య-1134 తో అధిక దిగుబడులు



నవతెలంగాణ-చేర్యాల

నూజివీడు సీడ్స్ వారి ఆధ్య-1134తో పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించొచ్చని ఆ కంపెనీ ఆర్ఎం శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కడువేరుగు గ్రామంలో ఓ రైతు సాగు చేసిన ఆధ్య-1134 పత్తి పంటలో మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూజివీడు సీడ్స్ గత 50 ఏండ్లుగా రైతులకు నూతన వంగడాలను అందిస్తున్నదన్నారు. అందులో భాగంగా వచ్చిన ఆధ్య-1134తో రైతులకు ఎంతోమేలు జరుగుతుందన్నారు.ఈ రకం పత్తి అన్ని రకాల చీడపీడలను సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. గులాబీ రంగు పురుగు ఉధృతిని సైతం తట్టుకుంటుందని వివరించారు. తద్వారా రైతులకు క్రిమి సంహారక ఖర్చులు తగ్గుతాయన్నారు. మొదటి కోతలోనే 80శాతం పత్తిని తీసుకోవడానికి వీలుంటుందన్నారు. తక్కువ పంటకాలం ఉండి తొందరగా కోతకు వచ్చి.. రెండో పంటకు కూడా అనుకూలంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా బెట్ట పరిస్థితులను కూడ అధిగమించడం వలన రైతులు నమ్మకమైన దిగుబడులను పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామంజనేయ ట్రేడర్స్ - కొండల్ రెడ్డి (డిస్ట్రిబ్యూటర్), వివిధ రాముల రైతులు పాల్గొన్నారు.

ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు పనులు



నవతెలంగాణ-జిన్నారం

ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాజిపల్లి టు బొల్లారం.. జర్నలిస్ట్ కాలనీ టు ప్రధాన రహదారి వరకు రోడు పనుల కార్యక్రమాన్ని ఆ ఫౌండేషన్ చైర్మెన్ అడ్వకేట్ దండే రమాకాంత్ నేతృత్వంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దండే రమాకాంత్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు పది లక్షల వ్యయంతో స్వయంగా ఆర్కే ఫౌండేషన్ ఈ పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కాజిపల్లి నిజాంపేట్ కాజిపల్లి బొల్లారం మియాపూర్ ప్రాంతాలకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కోసం స్థానికులు ఉపాధి నిమిత్తం కాజిపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారి అవసరార్థం ఆర్టీసీ బస్సుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించినట్టు రమకాంత్ తెలిపారు. అభివృద్ధి సేవాపరమైన సామాజిక కార్యక్రమాల కోసం ఆర్కే ఫౌండేషన్ నిరంతరంగా కృషి చేస్తుందన్నారు.

ప్యాక్స్ సభ్యులకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-ఝరాసంగం

మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో స్వల్పకాలిక దీర్ఘకా లిక రుణాలను పొందడమే కాకుండా ఎరువులు, విత్తనాలు, రైతులు పండించిన ధాన్యాలను ప్రభుత్వ మద్దతుతో కొనుగోలు చేయించడమే కాకుండా తదితర సేవలను అందించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ రిజిస్టర్ తుమ్మల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ హైదరాబాద్ వారు సంఘం సభ్యులకు ఎడ్యుకేషన్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి, సభ్యులకు సేవలు అందించడంలో పరస్పర సహకారం అధికారులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, అసిస్టెంట్ రిజిస్టర్ లు పుంసింగ్, శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ఎండి గౌసోద్దీన్, సెక్రటరీలు నిసార్ అహ్మద్, మహబూబ్ జానీ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లీం సోదరుల ఆధ్వర్యంలో బంద్



నవతెలంగాణ-కోహిర్

మహమ్మద్ ప్రవక్త పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఇంతవరకు చర్యలు చేపట్టలేదని మండలంలో ముస్లిం సోదరులు మంగళవారం బంద్ నిర్వహించారు. దుకాణాలు, హొటల్స్ బంద్ చేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

దేవాలయ భూముల కబ్జా

పట్టాగా మార్చుకున్నారని గ్రామస్తుల ఆందోళన
రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం



నవతెలంగాణ -ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో శివాలయానికి సంబంధించిన గ్రామ కంఠం సర్వేనెంబర్ 210 పదహారు గుంటలు, 203 లో పదమూడు మొత్తం 29 గుంటల భూమిని గ్రామానికి చెందిన దొర (రెడ్డి)లు కబ్జా చేసుకున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు అందరూ శివాలయం ముందు గుంతలు గుంతలుగా ఉన్న భూమిని చదునుచేసి, పూజలు చేసుకునేందుకు అనుగుణంగా, గోశాలగా మార్చేందుకు చదును చేశారు. దీంతో గ్రామానికి చెందిన దొరలమని (రెడ్డిలు) చెప్పుకునేవారు ఈ భూములన్నీ తమవి అని ఇందులో ఎలాంటి నిర్మాణం చేయొద్దంటూ అడ్డుకుంటున్నారన్నారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్‌కి గ్రామస్తులు దరఖాస్తు చేయగా మంగళవారం సర్వే చేయడానికి వచ్చారు. సర్వేకు వచ్చిన అధికారులు ఆర్ఐ, సర్వేయర్ సైతం ఎలాంటి విషయాన్ని చెప్పకుండానే, హద్దులు వేయకుండానే వెళ్ళిపోయారు. దీంతో దొరలకు సంబంధించిన భూములు ఉంటే సర్వే చేయించుకొని శివాలయానికి సంబంధించిన భూముల జోలికి రావొద్దని గ్రామస్తులు అన్నారు. గ్రామంలో ఎక్కడ ఖాళీ స్థలం, నక్షబాట ఉన్న కబ్జాలు చేస్తున్నారనీ గ్రామస్తులు ఆరోపించారు. దేవాలయానికి, గ్రామ కంఠానికి సంబంధించిన భూముల పరిరక్షణకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



నవతెలంగాణ-కల్హేర్

రైతులు తప్పకుండా భూసారం పరీక్షలు చేయించుకోవాలని.. అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయడం వలన అధిక దిగుబడులు సాధించొచ్చని జిల్లా వ్యవసాయ అధికారి(డిఏఓ) శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన కల్హేర్ రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు పంట కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి, పత్తి పంటల నాణ్యత ప్రమాణాలు భూసార పరీక్షల ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమాన్ని ఏడిఏ నూతన కుమార్ సిబ్బంది రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా డిఏవో శివప్రసాద్ మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయడం ద్వారా ఏఏ భూమిలో పోషక విలువలు ఏ మేరకు ఎంత శాతం ఉన్నాయో తెలుస్తాయన్నారు. వాటికనుగుణంగా ఏ భూములలో ఏ రకమైన పంటలు సాగు చేస్తే ఎక్కువగా దిగుబడులు సాధించవచ్చునో తెలు స్తుందన్నారు. అందులో భాగంగానే నాగ్ధర్, కృష్ణాపూర్, మాసన్‌పల్లి మహాదేవ్‌పల్లి, మార్డి గ్రామాల్లోసేకరించిన మట్టి నమూనాలను సంగారెడ్డి భూసార పరీక్ష కేంద్రం ద్వారా పరీక్షించి భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజే శారు. భూసార పరీక్షల ద్వారా రైతులకు ఎంత లాభం వాటి ఆవశ్యకతను గురించి డీఏవో వివరించారు. ఈ కార్యక్ర మంలో ఏడిఏ నూతన్ కుమార్ ఎస్‌టిఎల్ ఏడిఏ అంబిక సోనీ, ఎస్‌టిఎల్‌ఏఓ శ్రీకాంత్, రాహుల్, ఏఈఓలు సంతోష, కృష్ణవేణి, ప్రతిభ, వంశీవర్ధన్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన యువకుని మృతి

నవతెలంగాణ-నార్సింగి : చేపల వేటకు వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలోనీ కాముని చెరువులో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సయ్యద్ షకీల్ (27) ప్లంబర్ పని చేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన మిత్రుడు కండ్లకోయ అశోక్ తో చేపల వేట కోసం చెరువు కు వెళ్ళాడు. సయ్యద్ షకీల్ ప్రమాదవశాత్తు కాలు జారీ చెరువులోకి పడగా కాళ్లకు చెరువులో ఉన్న వలలు చుట్టుకుని నీట మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

నగరీకరణ పేర.. పంచాయతీలకు ఎసరు



- 50 గ్రామాల విలీనానికి ప్రతిపాదనలు
- అభివృద్ధికి నోచని పల్లెలపై కార్పొరేషన్ పన్ను పోటు
- పేదలకు ఉపాధి హామీ పనులు లేకుండా చేసే కుట్ర
- ఇకపై పటాన్‌చెరు నియోజవర్గంలో పంచాయతీలే ఉండవు
- పాతవి మూడు, కొత్తగా ఐదు మున్సిపాలిటీల్లో విలీనం
- సంగారెడ్డి కార్పొరేషన్.. 10 గ్రామాల విలీనం
- ప్రజాభిప్రాయాలకు భిన్నంగా రాజకీయ నిర్ణయాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

నగరీకరణ పేర పల్లెటూర్ల ఉనికే లేకుండా చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరానికి సమీపంలో ఉన్న శివారు గ్రామాల్ని పురపాలికల్లో విలీనం చేయాలని సర్కార్ యోచిస్తోంది. అవుటర్ రింగ్ రోడ్డుకు ఆనుకున్న శివారు గ్రామాల్నే కాకుండా అవుటర్ అవతలున్న గ్రామాల్ని కూడా మున్సిపాలిటీలుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొత్త శోభ పేరిట పల్లె జనాలపై కార్పొరేషన్ పన్ను పోటు వేసేందుకు, పేదలకందే ఉపాధి పనుల్ని లేకుండా చేసేందుకు కుట్ర సాగుతోంది. సర్కార్ తాజా నిర్ణయంలో 50 గ్రామాల ఉనికే ప్రశ్నార్థం కానుంది. 2 లక్షల మంది పల్లె జీవితాల్ని పట్నం పేరిట ధ్వంసం చేయబూనుకున్నారు. ప్రజాభిప్రాయాలకు భిన్నంగా రాజకీయ ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ ఇమేజీ కోసం పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో గ్రామ పంచాయతీల్లేకుండా చేయదాన్ని స్థానిక ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గంలో గ్రామ పంచాయతీలే ఉండవు

పటాన్‌చెరు నియోజకవర్గంలో జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు, గుమ్మడిదల, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాలున్నాయి. వీటిల్లో అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మూడు మున్సిపాలిటీలుగా ఏర్పడ్డాయి. రామచంద్రాపురం, భారతీనగర్, పటాన్‌చెరు మూడు కార్పొరేషన్ డివిజన్లున్నాయి. మూడు డివిజన్లు, మూడు కార్పొరేషన్ల పరిధిలోకి ఇప్పటికే అనేక గ్రామాల్ని కలిపారు. ఇటీవల తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లోకి 11 గ్రామాల్ని విలీనం చేశారు. తాజాగా పటాన్‌చెరు నియోజకవర్గంలో మిగిలిపోయిన గ్రామాలన్నింటినీ మున్సిపాలిటీల్లోకి తెచ్చేందుకు కొత్త ప్రతిపాదనలు చేశారు. కొత్తగా ఐదు మున్సిపాలిటీలు ఏర్పాటు చేయనున్నారు. పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ గ్రామాన్ని చిట్కూల్, రుద్రారం, లక్డారం, పాశమైలారం గ్రామాలతో కలిపి మున్సిపాలిటీగా చేయనున్నారు. బానూరులో నందిగామ, క్యాసారం ఊర్లను కలిపి మున్సిపాలిటీగా ఇంద్రేశం గ్రామంలో రాజేశ్వరంబండ, బచ్చుగూడ, ఐనోల్, చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల ఊర్లను విలీనం చేసి మున్సిపాలిటీగా చేస్తామంటున్నారు. గుమ్మడిదల మండల కేంద్రాన్ని అన్నారం, బొంతపల్లి, వీరన్నగూడం, దోమడుగు, మందాపూర్ గ్రామాలతో మున్సిపాలిటీగా, జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామాన్ని వావిలాల, లక్ష్మీపతిగూడెం, మాదారం, కాజీపల్లి, నల్తూరు గ్రామాలతో కలిపి మున్సిపాలిటీగా చేయజూస్తున్నారు. దాంతో పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, 60 గ్రామాలన్నీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌గా మారతాయి.

సంగారెడ్డి మున్సిపాలిటీ.. కార్పొరేషన్‌గా

జిల్లా కేంద్రంగా ఉన్న సంగారెడ్డి మున్సిపాలిటీని నగర పాలక సంస్థగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 1.20 లక్షల జనాభా కలిగిన సంగారెడ్డి మున్సిపాలిటీ 38 వార్డులతో విస్తరించి ఉంది. దీని పరిధిని పెంచి కార్పొరేషన్‌గా మార్చేందుకు అవసరమైన చుట్టుపక్కల గ్రామాల్ని విలీనం చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే పోతిరెడ్డిపల్లి, చింతలపల్లి, మల్కాపూర్ గ్రామాల్లోని కొంత భాగాన్ని గతంలోనే మున్సిపాలిటీలో విలీనం చేశారు. తాజాగా కార్పొరేషన్ స్థాయి కల్పించేందుకు అవసరమైన 8 గ్రామాల్ని కలిపేలా ప్రతిపాదనలు చేశారు. పసల్‌వాదీ, నాగాపూర్, ఇర్గిపల్లి, కులబ్‌గూర్, కలాబ్‌గూర్, కంది, చిమ్నాపూర్, నాగాపూర్ మల్కాపూర్ వంటి గ్రామాల్ని సంగారెడ్డి మున్సిపాలిటీలో విలీనం చేయనున్నారు.

50 గ్రామాల్లో 2 లక్షల మందికి ఉపాధి హామీ దూరం

ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల 50 గ్రామాల్ని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలో విలీనం చేయనున్నారు. ఈ గ్రామాల్లో 2 లక్షల జనాభా ఉంది. సంగారెడ్డి కార్పొరేషన్‌లో కలపనున్న ఎనిమిది గ్రామాల్లో 80 వేల మంది జనాభా ఉండగా ఇస్నాపుర్ మున్సిపాలిటీలో కలిపే గ్రామాల జనాభా 45 వేలు ఉంది. బానూరు మున్సిపాలిటీలో కలిపే గ్రామాల జనాభా 26 వేలు ఉండగా ఇంద్రేశం మున్సిపాలిటీలో కలిపే గ్రామాల జనాభా 16 వేలు, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలో కలిపే గ్రామాల్లో 35 వేల జనాభా ఉంటుంది. వీరందరూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. పాల ఉత్పత్తి, వివిధ వృత్తులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు పని గ్యారంటీ కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా లబ్ది చేకూరుతుంది. ఏటా వందల కోట్ల బడ్జెట్‌లో వేలాది మంది కూలీలకు పని కల్పిస్తూ రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలు, పంట పొలాలకు బాటల వంటి అభివృద్ధి పనులు చేస్తున్నారు. మున్సిపల్, కార్పొరేషన్‌లో విలీనమైతే ఉపాధి హామీ చట్టం అమలు కాదు. దాంతో రెండు లక్షల మందికి ఉపాధి లేకుండా పోయే ప్రమాదముంది.

పల్లెలపై కార్పొరేషన్ పన్నుపోటు

ఐదు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ పేరిట విలీనం చేసే 50 గ్రామాల్లో వివిధ రూపాల్లో కార్పొరేషన్ పన్నుల భారం పడనుంది. గ్రామ పంచాయతీ స్థాయిలో వివిధ భవనాల నిర్మాణాలకు అనుమతులు, ఆస్తి పన్ను, నీటి పన్ను, లైసెన్స్ పన్ను, లేఅవుట్లకు అనుమతుల విషయంలో సాధారణమైన పన్నులు మాత్రమే ఉన్నాయి. ఇకపై మున్సిపాలిటీలుగా మారే 40 గ్రామాల్లో సంగారెడ్డి కార్పొరేషన్‌లో విలీనమయ్యే పది గ్రామాల్లో కార్పొరేషన్ స్థాయి పన్నుల భారాలు పడతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పైగా ఏడేనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు రోడ్లు సరిగ్గాలేవు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, పార్కుల వంటి మౌలిక సదుపాయాల్లేకపోయినా పన్నులు మాత్రం వసూలు చేస్తారు. ఇప్పటికే తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లో కలిపిన గ్రామాల్లో ఇదే జరుగుతుంది.

ప్రజాభిప్రాయానికి భిన్నంగా రాజకీయ నిర్ణయం

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఒక్క గ్రామ పంచాయతీలేకుండా మున్సిపాలిటీలు ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి నివేదించారు. దాంతో కలెక్టర్‌కు ఆదేశాలు రావడంతో కొత్తగా ఐదు మున్సిపాలిటీల్లో అన్ని గ్రామాల్ని విలీనం చేసేందుకు కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రతిపాదనలు పంపారు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాన్ని మాజీ సర్పంచ్, వార్డు మెంబర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు వ్యతిరేకిస్తున్నారు. ఈజీఎస్ పనులు, ఇతర స్కీమ్స్ రద్దు అవుతాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

గ్రామాల అస్తిత్వం పోతుంది



: కృష్ణ, కులబ్‌గూరు, మాజీ వార్డుమెంబర్

గ్రామీణ ప్రాంతాల అస్తిత్వాన్ని దెబ్బతీయడం సరికాదు. కార్పొరేషన్ హోదా వస్తే పట్టణ కేంద్రం తప్ప విలీన గ్రామాల అభివృద్ధి పట్టదు. ఇప్పటికే విలీనమైన గ్రామాల్లో పాత సిబ్బందితోనే పారిశుద్ధ్యం, ఇతర పనులు చేయిస్తున్నారు. పన్నుల్ని మాత్రం పెంచి వసూలు చేస్తారు. జాతీయ ఉపాధి హామీ పనులు పోతే పేదలకు ఉపాధి ఉండదు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా నిర్ణయం తీసుకోవద్దు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్లకు దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం క్షేత్రస్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి, సందీప్ కుమార్ సుల్తానియాలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష జరిపారు. సమగ్ర ఇంటింటి కుటు ంబ సర్వే లక్ష్యాలు, విది విధానాలు, కార్యాచరణ గురించి వివరిస్తూ, సర్వే విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఈ కార్యక్ర మంలో అందరిని భాగస్వాములు చేస్తూ సర్వేను సమగ్రంగా జరిపించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదప డాలన్న సమున్నత ఆశయంతో ప్రభుత్వం ఈ సర్వేను చేపడుతోందని అన్నారు. సర్వే కోసం ఆయా బ్లాక్‌ల వారీగా ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లను గుర్తించాలన్నారు. 2011 జనాభా గణన అనుసారంగా ఎన్యూమరేషన్ బ్లాక్ లను ఏర్పాటు చేసుకోవాలని, కొత్తగా ఏర్పడిన కాలనీలు ఉంటే బ్లాక్‌లను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. 150 కుటుంబాలకు ఒకరు చొప్పున ఎన్యుమరేటర్లకు నియమించాలని, పది మంది ఎన్యుమరేటర్లకు ఒకరు చొప్పున సూపర్వైజర్లను సర్వే ప్రక్రియ పర్యవేక్షణ కోసం గుర్తించాలన్నారు. ఆన్ లైన్లో వివరాల నమోదులో తప్పిదాలు, లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని, సకాలంలో ఈ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. సర్వేకు సంబంధించిన ప్రగతిని రోజువారీగా పర్యవేక్షించాలని, అన్ని శాఖలను సమన్వయపరుస్తూ ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రెయినీ కలెక్టర్ మనోజ్, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, సీపీఓ బాలసౌరి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమీషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్‌లో నూతన పరిశ్రమ ప్రారంభం

ముఖ్య అతిథులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ

పీఎం జన్ ఆరోగ్య యోజన కార్యక్రమంలో అమీన్‌పూర్ నుంచి వర్చువల్‌గా హాజరు



నవతెలంగాణ-అమీన్‌పూర్

ఆయుర్వేద పితామహుడు ధనవంతురి జయంతి సందర్భంగా ఆయుష్మాన్ భారత్ పీఎం జన్ ఆరోగ్య యోజన కార్యక్రమం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ.. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కు సహజ మెడికల్ టెక్నాలజీ ప్రైవేట్ సంస్థలో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ వేదికగా వర్చువల్‌గా పాల్గొన్నారు. అంతకుముందు గుండెకు సంబంధించిన స్టంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. గుండెకు సంబం ధించిన స్టంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సుల్తాన్పూర్ డివైస్ పార్కులో తయారు కావడం చాలా సంతోషకరమన్నారు. రాష్ట్రాల్లో కూడా మెడికల్ కాలేజీలు తెలంగాణ రాష్ట్రంలో నెలకొల్పుతున్న స్టెంట్ మ్యానుఫ్యా క్చరింగ్ ఎస్ఎంటి పరిశ్రమ వారు తయారు చేయడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, టీజీఐఐ విష్ణురెడ్డి, సీఎంఓ కార్యాలయ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఆర్డీవో రవీందర్ రెడ్డి, పరిశ్రమ ఎండి సహజనంద్, ధీరజ్ లాల్ కోటాడియా, పరిశ్రమ ప్రతినిధులు, అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.12,000 హామీ అమలు చేయాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు బాబురావు, రమేష్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్లకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని, ఆటో అడ్డాల వద్ద ఆటో స్టాండ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు నష్టం కలిగించే భారతీయ న్యాయ సహిత చట్టం సెక్షన్ 106(1) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని.. ఎలాంటి కమిషన్ లేకుండా కేరళ తరహా రవాణా రంగం కార్మికులకు యాప్ తీసుకురావాలని, డిజిల్, పెట్రోల్ ఇన్సూరెన్స్, ఫిట్నెస్ ధరలు తగ్గించాలన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 చెల్లిస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో, టాటా ఏసీ, కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. వారు జీవనాధారం కోల్పోకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూడాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారించాలని.. లేని యెడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షులు మాణిక్యం, నాయకులు దాస్, రాజు, అశోక్, రాములు, అంజి, విష్ణు, దావిద్, విఠల్, రాసుల్, చిరంజీవి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్యూబాపై అమెరికన్ సామ్రాజ్యవాద నిరంకుశ, నిర్బంధాన్ని ఖండించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవతెలంగాణ-సంగారెడ్డి

క్యూబా పై అమెరికన్ సామ్రాజ్యవాద నిరంకుశ, నిర్బంధాన్ని ఖండించాలని సీఐటీయూ అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక సుందరయ్య భవన్ నుండి న్యూ బస్టాండ్ వరకు సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్యూబా దేశానికి మంగళవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. గత 31 ఏండ్లుగా జనరల్ అసెంబ్లీ క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య ఆర్థిక దిగ్బంధనానికి ముగింపు పలకాలనే తీర్మానాన్ని అత్యధిక మెజార్టీతో ఆమోదించిందన్నారు. గత 63 ఏండ్లుగా దిగ్బంధనం వల్ల క్యూబా ఆర్థికంగా 164.14 బిలియన్ డాలర్లను నష్టపోయిందన్నారు. ద్రవ్యోల్బనం రీత్యా చూస్తే ఇది మొత్తం 1.499 ట్రిలియన్ డాలర్లు అని అన్నారు. ట్రంపు అధికారంలో ఉన్నప్పుడు అమెరికాన్లు క్యూబాకు ప్రయాణించడానికి అడ్డంకులు కల్పిస్తూ అనేక కొత్త కొత్త నిబంధనలు జారీ చేశారని.. అవే ఆంక్షలు, నిబంధనలు అమెరికా అధ్యక్షుడు బైడన్ పరిపాలనలో కూడా కొనసాగుతున్నా యన్నారు. ఈ నిబంధనల కారణంగా దిగుమతులు తగ్గిపోయాయన్నారు. క్యూబాను తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంగా అమెరికా పరిగణిస్తున్నదని.. దాంతో క్యూబా ఆర్థిక, బ్యాంకింగ్ లావాదేవీలు, విదేశీ వాణిజ్యం, ఆదాయం వనరులు, ఎనర్జీ, క్రెడిట్ లావాదేవీలకు తీవ్ర అవరోధం ఏర్పడు తున్నదన్నారు. క్యూబా ఆరోగ్య సంరక్షణ, ఆహారం వ్యవసాయ రంగాలకు వర్తించే విధంగా అమెరికా ఉద్దేశపూర్వకంగా నిషేధాలు, పరిమితులను అమలు చేస్తు న్నదన్నారు. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ యంత్రాల నిర్వహణకు అవసరమైన ఇంధనం, నూనెలు మరియు లూబ్రికెట్ల కొరత, ఎరువులు, పురుగు మందుల కొరత టన్నులకొద్దీ ఉత్పత్తు లను శితిలికరించే సామర్థ్యం కోల్పోవడం వంటి కారణాలవల్ల ఆహార ఉత్పత్తి తగ్గిందన్నారు. క్యూబా దేశాన్ని కాపాడుకోవడం కార్మిక వర్గంపై దేశ ప్రజలపై ఉన్నదన్నారు. కరోనా లాంటి విపత్తుకాలంలో అతిచిన్న దేశమైన క్యూబా 52 దేశాలకు వారి దేశాల నుండి డాక్టర్లు పంపించి అండగా నిలిచిందన్నారు. అలాంటి దేశంపై అమెరికా సామ్రాజ్యవాదం నిర్బంధానికి ముగింపు పలకాలని ఐక్యరాజ్యసమితిలో తీర్మానం జరిగేలా సంఘీభావంగా ప్రపంచ దేశాలు నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, జిల్లా కోశాధికారి కే.రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, నాయకులు పుండరీకం, అల్లి, శ్రీధర్, రాజు, దత్తు, మల్లేశం, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ జాప్యంతో రైతులకు నష్టం

- మద్దతు ధర కంటే తక్కువకు అమ్మవద్దు
- రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కేంద్ర ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాప్యం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని, కేంద్రంలో ఉన్న రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 322 పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పోతారం (ఎస్) గ్రామ పరిధిలోని ఆర్ కే జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ కేంద్ర ప్రభుత్వం నిర్దేశనలో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా కాటన్ కొనుగోలు చేస్తున్నారన్నారు. మౌలిక వసతుల కల్పన అడ్మినిస్ట్రేషన్ సహకారం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎక్కడ కూడా రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువగా అమ్ముకునే పరిస్థితి రావద్దన్నారు. పత్తి కొనుగోలు క్రయ విక్రయాలు ఎక్కడ ఇబ్బంది పడకుండా కేంద్రం కొనుగోలు కేంద్రాలు పెంచాలన్నారు. సెప్టెంబర్ వరకు పత్తి కొనుగోలు కొనసాగుతుందన్నారు. పత్తిలో తేమ శాతం 8 లోపు ఉంటే రూ.7500 ధర ఉంటుందన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలోని అన్ని సెంటర్లలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లా కలెక్టర్లకు విజ్ఞప్తి చేస్తున్నా, ధాన్యం, పత్తి కొనుగోలుకు సంబంధించి ఎక్కడ ఇబ్బంది కలగద్దని అన్ని రకాలుగా పర్యవేక్షణ జరుగుతుందని చెప్పారు. గ్రామంలో రైతులకు ఎక్కడ ఇబ్బందులు కలిగినా ప్రభుత్వ అధికారులతో చర్చించాలని స్థానిక నాయకత్వాన్ని సూచించారు. రైతులకు ఇబ్బంది కలిగితే మీదే బాధ్యత అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల దగ్గర సేకరించిన వడ్ల పేరు మీద రూ. 20 వేల కోట్ల విలువైన ధాన్యం ఇవ్వక, డబ్బు కట్టక పెండింగ్‌లో ఉందన్నారు. దీంతో ధాన్యం కొనుగోలుపై మిల్లర్ల కేటాయింపు జరగలేదన్నారు. జీరో డ్యూ ఉండి ప్రభుత్వానికి మంచిగా చెల్లించిన వారి కేటాయింపు జరుగుతుందన్నారు. డిఫాల్ట్ ఉన్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపు చేయడం లేదన్నారు. మిల్లు కేటాయించలేదనే పేరు మీద ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆగదన్నారు. పార్టీలకతీతంగా రైతులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, ఆర్డిఓ రామ్మూర్తి, తహసిల్దార్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

2

సంగారెడ్డి

బుధవారం | 30 అక్టోబర్ 2024 | www.navatelangana.com

బాధితుడికి ఎల్ఓసీ అందించిన గిరిధర్ రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని గడి వీధికి చెందిన మొహమ్మద్ ముజఫర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం లక్ష రూపాయలు ఖర్చు వస్తుందని వైద్యులు తెలుపడంతో.. బాధితుడు వెంటనే తెలంగాణ రాష్ట్ర సెట్విన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డిని సంప్రదించారు. గిరిధర్‌రెడ్డి తక్షణమే స్పందించి.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మరియు రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ల సహకారంతో మొహమ్మద్ ముజఫర్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1 లక్ష ఎల్‌ఓసిని మంజూరు చేయించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు ఈ ఎల్ఓసీని జహీరాబాద్ లోని తన కార్యాలయంలో గిరిధర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ మహమ్మద్ ముబీన్, మాజీ మున్సిపల్ చైర్మెన్ మహంకాళి శుభాష్ గుప్తా, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,నాగిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని తాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కంకోల్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా న్యాయాధికార సేవ సంస్థ చైర్మెన్, ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర, న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి రమేష్‌లు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టం న్యాయ పరమైన అంశాలను అవగాహన కలిగి ఉండాలన్నారు. పొక్సో, గృహహింస, వరకట్న నిషేధ చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల చదువు, ఆహారం, వసతి సౌకర్యాల విషయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వార్డెన్ ఉన్నారు.



జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జోగిపేట

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. జోగిపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓ అశోక్‌కు గ్రామపంచాయతీ కార్మికులకుతో కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు రెండో పీఆర్సీ వెంటనే అమలు చేయాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు దుర్గేష్ రాములు దేవేందర్ రమేష్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సతీమణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-కల్హేర్

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా హైదారాబాద్‌లోని వారి స్వగృహంలో బీఆర్ఎస్ కల్హేర్ మండల ఉపాధ్యక్షులు ఎస్.యాకోబు, రాపర్తి తాజా మాజీ సర్పంచ్ ఎం.శ్రావణ్ కుమార్, అలీఖాన్‌పల్లి తాజా మాజీ సర్పంచ్ రవి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఎస్జీటీయూ మొగుడంపల్లి నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జహీరాబాద్

ఎస్జీటీయూ మొగుడంపల్లి మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల ప్రభాకర్, నిమ్మల కిష్టయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాగా ఎన్నికల అధికారులుగా విశ్వనాథ్ , డాక్టర్ శివశేఖర్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా జాడి మల్కాపూర్ పాఠశాల ఉపాధ్యాయులు భానోత్ కిషన్, ప్రధాన కార్యదర్శిగా ఖాన్‌జమల్‌పూర్ ఉపాధ్యాయులు పీఅండ్ రాజ్, ఉపాధ్య క్షులుగా జీవనజ్యోతి, కోశాధికారిగా ఎండి హజార్, కార్యదర్శిగా నాగవేణి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల, టౌన్ అధ్యక్షులు విశ్వనాథ్, షకీల్, గౌరవాధ్యక్షులు శివశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో స్వచ్ఛంద బంద్ ప్రశాంతం

నవతెలంగాణ-జహీరాబాద్

ముస్లిం మైనార్టీలపై దాడులను నిరసిస్తూ.. ముస్లిం జేఏసీ పిలుపులో భాగంగా జహీరాబాద్‌లో మంగళవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన వ్యాపార సముదాయాలను ఉదయం నుండే ఎవరు కూడా తీయకపోవడంతో వ్యాపార సముదాయాలన్నీ బోసిపోయాయి.

మూడ్రోజులుగా అంధకారంలో ఎస్సీ కాలనీ



నవతెలంగాణ-కోహిర్

మండలంలోని గొడ్యార్పల్లి గ్రామ ఎస్సీ కాలనీలో వీధిలైట్లు లేక గత మూడ్రోజులుగా కాలనీ అంధకారంలో ఉన్నది. దాంతో రాత్రి సమయంలో బయటికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి చెప్పినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. వెంటనే వీధిలైట్లు వేయాలని కోరుతున్నారు.



హెూప్ న్యూరో హాస్పిటల్ ఆధ్వర్యంలో 3కే రన్

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) దినోత్సవాన్ని పురస్కంచుకుని హెూప్ న్యూరో, కార్డియాక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక ఐబి నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు 3 కే రన్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ సంజీవరావు హాజరై.. జెండా ఊపి రన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రెయిన్ స్ట్రోక్ అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాన్ని హెూప్ న్యూరో హాస్పిటల్ వారు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా హెూప్ న్యూరో, కార్డియాక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ న్యూరో సర్జన్ డా.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పక్షవాతానికి గల కారణాలు, నివారణ మార్గాలను, చికిత్స విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎం అధ్యక్షులు డా.ఉషా కిరణ్ ,యువజన సంఘాల అధ్యక్షులు కూన వేణు, సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు అతిమెల మానిక్, వివిధ సంఘాల నాయకులు దుర్గాప్రసాద్, ఇమ్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో ఇంటింటి సర్వే కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అధికారులతో మంగళవారం వీడియో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహిస్తున్నదన్నారు. సర్వే కోసం ఎమ్యూనేటర్లు, ఎమ్యూనేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలం వారీగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు ఎమ్యూనేటర్ల ఎంపికను శ్రద్ధతో జరిపి, వారి వివరాలను బ్లాక్ వారీగా అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్లకు ఆదేశించారు. రెవెన్యూ గ్రామాలు, గ్రామ పంచాయతీల్లో విలీనం కావడంతో ఎదురవుతున్న సమస్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల న్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సర్వే నిర్వహణ కోసం ఎమ్యూనేటర్లకు సంబంధించిన ప్రత్యేక శిక్షణను ట్రేనర్స్ ఆఫ్ ట్రేనర్స్ ద్వారా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సర్వే పనిని వేగంగా విజయవంతంగా పూర్తి చేయడానికి అత్యుత్తమ ఎమ్యూనేటర్లను ఎంపిక చేయాలని, అవసరమైతే అదనంగా ఎమ్యూనేటర్లు కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ప్రతి తహసీల్దార్, ఎంపీడీఓ దగ్గర గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల నివాస స్థలాల మ్యాప్‌లు, హౌస్ లిస్టింగ్ ఫార్మాట్, 57 ప్రశ్నల ఫార్మాట్, సర్వే పూర్తి అయిన ఇంటిపై అతికించు స్టిక్కర్ అందుబాటులో ఉండాలన్నారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా, ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో స్థానిక అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రయినింగ్ కలెక్టర్ మనోజ్, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, సీఎంఓ బాలసౌరి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, మునిసిపల్ కమీషనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షణకి ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-పటాన్‌చెరు

అరుణాచలం గిరిప్రదక్షిణకి వెళ్లే వారి కోసం పటాన్‌చెరు, రామచంద్రాపురం, బిహెచ్ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, అమీర్ పేట్, ఎంజీబీఎస్, జేబీఎస్ పరిసర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు వేస్తున్నట్టు బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ సుధా తెలిపారు. వచ్చేనెల 13న కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా టీజీ ఆర్టీసీ సూపర్ లగ్జరీ సర్వీస్ నెంబర్-98886 మరియు రాజధాని సర్వీస్ నెంబర్ 98882 ప్రత్యేక బస్‌లు బయలు దేరుతున్నట్టు చెప్పారు. తిరిగి 16న ఉదయం హైదరాబాద్ వస్తాయన్నారు. మార్గ మధ్యంలో కాణిపాకం, వెల్లూరు శ్రీ నారాయణమ్మ వారి సందర్శనం ఉంటుందన్నారు. బీహెచ్ఈఎల్, ఎంజి బీఎస్ నుంచి సూపర్ లగ్జరీకి టికెట్ ధర రూ.4వేలు, రాజధానికి రూ.5230 ఉంటున్నట్టు చెప్పారు. టికెట్ బుకింగ్ కోసం ఎడిబి ఏజెంట్ వద్ద కానీ, ఆన్‌లైన్‌ద్వారా www.tgsrtcbus.in లో కానీ బుక్ చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 9959226149, 9959226153, 9959227250, 9959226249 సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ర్యాగింగ్ చట్టరిత్యా నేరం..

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

ర్యాగింగ్ అనేది చట్టరిత్యా నేరం అని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ సెన్సిటైజేషన్ కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడుతూ.. కొంతమంది విద్యార్థులు ర్యాగింగ్ చేస్తూ ఇతర విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసి ఆనంది స్తున్నారని.. అలాంటప్పుడు నిర్భయంగా జిల్లా పోలీస్ షీ-టీం నెంబర్: 8712656772, ఎస్-ఎన్ఏబి- 8712656777 లేదా డైల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీసు శాఖ ఉక్కు పాదం మోపుతున్నదన్నారు. మాదకద్రవ్యాల ఉనికి లేకుండా చేయడానికి జిల్లాలో ప్రత్యేకంగా నార్కోటిక్ అనాలసిస్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసి, విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గంజాయి, గుట్కా, సిగరెట్ వంటి ఇతర మత్తు పదార్థాలకు బానిసలైతే, మత్తులో జీవితాలు చిత్తు అవుతాయన్నారు. విద్యార్థులు మొదటగా చదువు పై దృష్టి సారించాలని, అనవసర సరదాలకు పోయి కష్టాలను కొనితెచ్చుకోవద్దన్నారు. తల్లిదండ్రులు నమ్మకాన్ని వమ్ముచేయకుండా కష్టపడి చదివి భవిష్యత్తులో ఉత్తమ డాక్టర్లుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు నూతన చట్టాల గురించి అవగాహన కలిగి, చట్టాలకు లోబడి ఉండాలని మెడికోలకు సూచించారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు వివరణతో కూడిన సమాధానాలు చెబుతూ, అందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, సూపరింటెండెంట్ డా.అనిల్ కుమార్, మెడికల్ కళాశాల ప్రొఫెసర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనంద్ కృష్ణారెడ్డికి అబ్దుల్ కలాం జాతీయ అవార్డు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



తండ్రి అడుగుజాడలో నడుస్తూ అనేక సామాజిక కార్యక్రమాలతో ప్రముఖ సంఘసేవకుడిగా పేరొందిన బొల్లారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డికి శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ, శ్రీ భవాని కూచిపూడి నర్తనశాల సమిష్టిగా నిర్వహించిన భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో భాగంగా ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు లభించింది. బీరంగూడెం మల్లికార్జున స్వామి ఆలయంలో అవార్డు పురస్కార ప్రధానో త్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ మాధవినేని రఘునందన్ రావు, ప్రముఖ జ్యోతిష్య శాస్త్రజ్ఞుడు దైవజ్ఞ శర్మ దైవజ్ఞ శర్మ, శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ సంస్థ అధినేత డా. కళా అశోక్ నక్కా, భవాని కూచిపూడి నర్తనశాల అదియేత్రి భవాని, దళిత రత్న డా.ఏర్పుల శ్రీనివాస్ హాజరై పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఆనంద్ కృష్ణారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ పేదల, బడుగు బలహీన వర్గాల, విద్యార్థి, కార్మికుల కోసం తనవంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తన సేవలను గుర్తించి ఈ అవార్డును అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డును కీర్తిశేషులు తన తండ్రికి, సేవా కార్యక్రమంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న తన కుటుంబ సభ్యులకుఅంకితం చేసున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో భారత్ బుక్ ఆఫ్ రికార్డ్ అధినేత, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

బాలవిహార్ పార్క్ పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్‌లో అభివృద్ధి పనుల్లో భాగంగా శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద సువర్ణారు రూ.50 లక్షలతో జరుగుతున్న బాలవిహార్ పార్క్ సుందరీకరణ పనులను కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ ప్రభు, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్క్‌లో నూతన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ప్లే ఆపరేటర్స్, గేట్, పార్క్ కమాన్, వాల్ పెయింటింగ్, గజిబో (యోగ చేసే స్థలం), బట్టర్ ఫ్లై లైటింగ్, చైర్స్ మరియు గాంధీ విగ్రహానికి సుందరీకరణ పనులు జరగనున్నాయన్నారు. అలాగే అక్కడ జరుగుతున్న వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించి నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా లేని విదంగా థీమ్ పార్క్ మాదిరిగా బాలవిహార్ పార్కును సైతం సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పీటర్, ఐలాపూర్, ఐలేష్, సీఎం మల్లేష్, మహేందర్‌రెడ్డి, మల్లేష్, రవి, భూషణం, జగన్, నవీన్, నర్సింహా, చంద్రకళ, అశ్విని, విజయలక్ష్మి, మహేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హత్నూర

మండల పరిధిలోని రొయ్యపల్లి, నాగారం, పల్పనూర్, గుండ్ల మాచనూర్, బోరపట్ల, సాధుల్లా నగర్ గ్రామాల్లో ఐకెపి కేంద్రంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. క్వింటాలుకు ఐదు నుంచి ఆరు కిలోలను తీస్తే సహించేది లేదని ప్రాథమిక సహకార సంఘం సభ్యులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వావిలాల నరసింహులు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ దుర్గారెడ్డి, బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు తుమ్మలపల్లి కిషోర్, రామచంద్ర రెడ్డి, ఆగమయ్య, ఇంద్రసేనారెడ్డి, బాబు యాదవ్, సురేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా దీపావలి వేడుక

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు దీపోత్సవం పేరిట దీపావళి వేడుకలను ఉల్లాసభరితంగా, సృజనాత్మకతను చాటేలా మంగళవారం నిర్వహించారు. గీతం, హైదరాబాదు ప్రాంగణమంతటా ప్రతిధ్వనించే సానుకూల శక్తి, పండుగ ఉల్లాసాన్ని స్వాగతిస్తూ, దీపాల అద్భుత శక్తిని విద్యార్థులంతా కలిసి స్వీకరించారు. దీనికి ముందు, పర్యావరణ అనుకూలమైన దీపాలకు రంగులు వేయడం ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతను వ్యక్తీకరించడమే గాక, పరిసరాలను రంగులమయం చేశారు. ఈ వేడుకకు రంగోలి పోటీ జతకలిసి విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఈ ఆహ్లాదకరమైన సంస్కృతుల కలయికలో, 'స్పార్క్స్ అండ్ స్పిరిట్స్' పేరిట హలో వీన్‌ను కూడా గీతం విద్యార్థులు నిర్వహించారు. భోగి మంటలు వెలిగించి, దెయ్యాలను పారద్రోలేందుకు సృజనాత్మక దుస్తులను ధరించి ఈ భయానక వేడుకలో పాల్గొన్నారు. దీపావళి, హలోవీన్ ఉత్సవాల ఈ ప్రత్యేక సమ్మేళనం విద్యార్థులలో ఆనందాన్ని పెంపొందించి, విభిన్న అనుభవాలను కలిగించింది.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉమామహేశ్వరరావు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు వరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరెడ్డి మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డి నుంచి ఉమామహేశ్వరరావు మంగళవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. తనకు ఇప్పటివరకు సహ కరించిన సిబ్బంది, పట్టణ ప్రజలకు శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అన్నిటిని ప్రజల వద్దకు తీసుకువెళ్లి వాటిని అర్హులందరికీ చెందే విధంగా శాయశక్తుల కృషి చేస్తానని ఉమామహేశ్వరరావు అన్నారు. పట్టణంలో పారిశుధ్యంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మల్లేపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కొండాపూర్



మండలంలోని మల్లేపల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులను పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఉపతహసీల్దార్ మద్రి ప్రదీప్, పంచాయతీ సెక్రెటరీ కటకం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శివ లీల జగదీశ్వర్, నరసింహారెడ్డి, శివారెడ్డి గ్రామస్తులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ఎస్ఆర్ఆజీఎస్ నిధుల కింద రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించినట్టు చెప్పారు. సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకే యూత్ ఫెస్టివల్



నవతెలంగాణ-జహీరాబాద్

విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకే యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శాంతకుమార్ అన్నారు. స్థానిక షెట్కర్ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన యూత్ ఫెస్టివల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని.. గత విద్యా సంవత్సరంలో ఇంటర్, మొదటి ద్వితీయ సంవత్సరంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు నేడు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి వివిధ దేశ విదేశాల్లో స్థిరపడడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా విద్యను అందిస్తున్నామని.. విద్యార్థులకు కూడా అందుకు తగ్గట్టు గానే రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. కాగా విద్యార్థులు ఆటపాటలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు శివన్న, డాక్టర్ సిద్దన్న, డైరెక్టర్లు కృష్ణ చైతన్య, నాగరాజ్, మహేష్, అధ్యాపకులు వెంకటయ్య ,కాంతరెడ్డి, జయసింగ్, శివరాజ్, సంగీత, వరలక్ష్మి, చంద్రశేఖర్ సాయి బాబా పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఎంపీడీవో

నవతెలంగాణ-వట్‌పల్లి



మండల పరిధిలోని దేవునూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను, సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఎంపీడీవో శశి ప్రభ మంగళవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ కనిపిస్తున్నదని.. సంఖ్యను పెంచుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వసతిగృహానికి రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో ఇన్చార్జి వార్డెన్ వారానికి రెండుసార్లు వచ్చిపోతుంటాడని.. విద్యార్థుల బాగోగులను అక్కడ ఉన్న సిబ్బంది చూసుకుంటున్నారని ఆమె తెలిపారు. వసతి గృహంలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడి కేంద్రాలను సందర్శించినప్పటికీ కేంద్రం తెర్చుకోకపోవడంతో.. ఆరా తీయగా జోగిపేటలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమానికి వెళ్లినట్టు తెలిసింది. ఉపాధ్యాయ సిబ్బంది టైం టేబుల్ ప్రకారం పాఠశాలకు చేరుకోవాలన్నారు.

ఉజ్జంపాడు గ్రామ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సిర్గాపూర్

మండలంలోని ఉజ్జంపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు మోషప్ప డిమాండ్ చేశారు. గ్రామంలోని దళితవాడలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మోషప్ప మాట్లాడుతూ.. దెబ్బతిన్న బోర్ మోటార్‌ను వెంటనే రిపేర్ చేయాలన్నారు. గత ప్రభుత్వంలో నుంచి ఆందోళన చేస్తున్నా.. ఇప్పటివరకు రిపేర్ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అలాగే రోడ్డుపై మురికి అపరిశుభ్రత ఉందని.. వెంటనే పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. అలాగే నీటి సమస్యను కూడా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శివ, సంజీవ్, వీరేష్, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దీపావలి లోపు కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలి

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట ప్రాంతంలో ఉన్న అన్ని పరిశ్రమల్లో.. బట్టల దుకాణాలు, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రైవేట్ స్కూల్స్ కాలేజీలలో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగస్తులకు దీపావలి లోపు బోనస్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సదాశివపేట ప్రాంతంలో అనేక మంది కార్మికులు ఏండ్లుగా పనిచేస్తున్నారన్నారు. వారికి బోనస్ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. 1965 బోనస్ చట్ట ప్రకారం సంస్థలో 30 రోజులు పని చేసిన కార్మికులకు తప్పకుండా దీపావళి పండగ లోపు బోనస్ ఇవ్వాలన్నారు. బోనస్ ఎగొట్టాలని అనేక పరిశ్రమ యజమాన్యాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కాంట్రాక్టు, క్యాజువల్, ఔట్సోర్సింగ్, ఫిక్స్‌టర్మ్, ఎంగేజ్ అనే రకర కాల పేర్లతో కార్మికులతో పని చేయించుకుంటున్నారన్నారు. వారికి చట్టపరమైన సౌకర్యాలు ఇవ్వడం లేదన్నారు. అన్ని సంస్థల్లో పనిచేస్తున్న వారికి బోనస్ ఇవ్వాలన్నారు. బోనస్ ఇవ్వకపోతే సీఐటీయూ నాయకత్వాన్ని సంప్రదించాలన్నారు. బోనస్ ఇవ్వని పరిశ్రమలవద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఓ గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైంది. సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 60 నుంచి 65 ఏండ్ల మధ్య వయసున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి సంగారెడ్డి ప్రభుత్వ దవఖానాకి చికిత్స నిమిత్తం వచ్చాడు. ఇక్కడే అక్కడ చుట్టు పక్కల ఉన్న షాప్‌లలో వివిధ వస్తువులు అడుక్కొని తింటూ, రాత్రి సమయంలో హాస్పిటల్ ముందు ఉన్న జనరిక్ మెడికల్ స్టోర్ పక్కనగల రూమ్లో పడుకునేవాడు. ఈ క్రమంలో అతడు ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు పిచ్చకుంట్ల వీరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ దావఖానా మార్చురీలో భద్రపర్చినట్టు చెప్పారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే సంగారెడ్డి పోలీస్ స్టేషన్ 08455బీ276333, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ 8712656718కు సమాచారం అందించాలన్నారు.

పారిశుద్ధ్య పనులకు ఆధునాతన పరికరాలు

- డీఎల్‌పీఓ ప్రత్యేక చొరవతో

నవతెలంగాణ-పాపన్నపేట



పంచాయతీ కార్మికులకు అలసట లేకుండా తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే విధంగా అవసరమైన అధునాతన సామాగ్రిని అందుబాటులో ఉంచామని డీఎల్‌పీఓ మండల స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ భవనంలో సామాగ్రిని పంచాయతీ కార్మికులకు అందజేసి, వాటిని వాడే విధానాన్ని వారికి వివరించారు. దోమల నివారణకు ఫోర్ టేబుల్ ఫాగింగ్ మిషన్, కొనుగోలు చేశామన్నారు. దీని ద్వారా ప్రతి చిన్న గల్లిలోకి వెళ్లి ఫైర్ చేయవచ్చన్నారు. అంతేకాకుండా గ్రాస్ కట్టర్, చెత్తను తొలగించే మిషన్, సేకరించే మిషన్, అందుబాటులోకి తెచ్చామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు సులభంగా పనిచేయడానికి పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నహీం, పంచాయతీ సిబ్బంది కిట్టు, తదితరులు ఉన్నారు.

యాంటీ నార్కోటిక్ బ్యూరో పోస్టర్ ఆవిష్కరణ

- ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



మండల పరిధిలోని చీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో పోస్టర్‌ను నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ అనే పదం వినపడకుండా చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

మంత్రి దామోదర్‌ను కలిసిన సాయి చరణ్

నవతెలంగాణ-కొల్చారం



రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మను ఎమ్మెస్సార్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు సంగాయిపేట గ్రామానికి చెందిన మన్నే సాయి చరణ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సాయి చరణ్ మాట్లాడుతూ ప్రజా సేవ చేసే ప్రతి యువకునికి మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులు తప్పనిసరిగా ఉంటాయని భరోసా కల్పించారని తెలిపారు. యువకుడు ఉత్సాహవంతుడు సాయి చరణ్ భవిష్యత్తులో మంచి సేవా కార్యక్రమాలు చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా మంత్రి ఆశిస్తున్నారని తెలిపారు.

దుర్గామాతను దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-పాపన్నపేట



మెదక్ అడిషనల్ కలెక్టర్ నగేష్ శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనకు ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది ప్రతాప్ రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం


నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో రామాయంపేట సొసైటీ చైర్మెన్ బాజా చంద్రం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ఎండబెట్టిన తర్వాత వడ్ల కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏ గ్రేడు రకం వడ్లకు రూ.2320లు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ చప్పట నరసింహారెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ నంద్యాల బాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, ఆలయ కమిటీ చైర్మెన్ రామ్ రెడ్డి, నంద్యాల మోహన్ రెడ్డి, బాజ గౌరయ్య , సంగేపు నారాయణ, కాకి రాజయ్య, భాగ్య, నాగరాజు, బాజా రమేష్, నంద్యాల యాదవ రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, పాల్గొన్నారు

బాధితులను పరామర్శించిన కంఠారెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన మాజీ ఆలయ కమిటీ చైర్మెన్ ఆకుల మహేందర్ తండ్రి మరణించడంతో బీఆర్ఎస్ జిల్లా ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుండెపోటుతో మరణించిన నస్కల్ గ్రామానికి చెందిన మెట్టు బాలరాజ్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్లు అందె కొండల్ రెడ్డి, బాపురెడ్డి, మాజీ సర్పంచులు సంగు స్వామి, గోపరి నర్సింలు, తాజా మాజీ ఎంపీటీసీలు నంద్యాల బాల్ రెడ్డి, కిష్టా గౌడ్, చింతల స్వామి, రెడ్డి శెట్టి రవీందర్, మావురం రాజు, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే చదువుకోవాలి

- ప్రధానోపాధ్యాయులు సిద్ధ రాములు

నవతెలంగాణ-చేగుంట



బడీడు పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలలో చదువుకోవాలని ప్రధానోపాధ్యాయులు సిద్ధి రాములు పేర్కొన్నారు. చేగుంట మండలం వడియారం ప్రాథమిక పాఠశాల్లో చదివే విద్యార్థులు చాలామంది గైర్హాజరవుతున్నారు. ప్రధానోపాధ్యాయులు సిద్ధ రాములు గ్రామంలో గైర్హాజర్ అవుతున్న విద్యార్థుల ఇండ్లను మంగళవారం సందర్శించారు. విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు పాఠశాలలోనే చదువుకోవాలని, విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. పాఠశాలకు రాకపోతే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు పిల్లలకు ఎలా అర్థమవుతాయని, పరీక్షల్లో ఏమి రాయలేకపోతారని తెలిపారు. తల్లి, తండ్రి విద్యార్థులను పాఠశాలకు పంపించాలని కోరారు.

అన్నదమ్ములపై కేసు నమోదు

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రానికి చెందిన బత్తుల శ్రీరాములు, బత్తుల అర్జున్, బత్తుల వెంకటేశం, ముగ్గురు అన్నదమ్ములు సోమవారం రాత్రి భూతగాదాలలో గొడవ పడి ఒకరినొకరు కట్టెలతో కొట్టుకోవడంతో శ్రీరాములు, అర్జున్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బత్తుల లక్ష్మీ ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురి అన్నదమ్ములపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

సబ్ జైలులో న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం

- ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-మెదక్ టౌన్



జిల్లా కేంద్రంలోని కారాగారంలో వున్న ఖైదీలకు న్యాయ సేవలు అందుబాటులో ఉంచడం కోసం జైలులో న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రధాన న్యాయ మూర్తి లక్ష్మీ శారద ప్రారంభించారు. ఖైదీలు జైలులో ఉన్నపటికీ మౌలిక రాజ్యాంగ హక్కులను కాపాడే విధంగా వారికి న్యాయం జరిగే విధంగా చూడడానికి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్, న్యాయవాది, పార లీగల్ వాలంటీర్‌లను ప్రతి మంగళ, గురువారం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ఖైదీలు సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-చేగుంట



మండలం అనంతసాగర్ గ్రామంలో చందా యాదగిరి మరణించిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి కుటుంబాన్ని పరామర్శించారు. దుబ్బాక నియోజకవ ర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్ బాధిత కుటుంబాన్ని మంగళవారం మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్‌తో కలిసి పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాసాయిపేట శ్రీనివాస్, నాయకులు శంకరయ్య, బిక్షపతి ,చౌడం రాజు, బి. స్వామి, నర్సింలు రాధాకృష్ణ, మహేష్, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విద్యుత్ లైన్ ఏర్పాటు

నవతెలంగాణ-నిజాంపేట



అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పంజా మహేందర్ తెలిపారు. మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావుకు విన్నవించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కరెంటు అధికారులతో మాట్లాడి ఆలయ నిర్మాణానికి విద్యుత్ లైన్ ఇవ్వడం జరిగిందని దీనికి సహకరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల ఆధ్వర్యంలో సీఐటీయూ జెండావిష్కరణ

- పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి
- ప్రభుత్వాలు, పాలకులు మారిన పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు మారలేదు
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు సీఐటీయూ జండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏ.మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారినా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల బతుకులు మాత్రం మారలేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు రోజురోజుకు పని భారం పెరుగుతూనే ఉందన్నారు. ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకొని, వారి జీవితాలను పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కార్మికుల పనికి తగ్గట్లుగా నెలకు రూ. 26 వేల వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలలో వారాంతపు సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ రంగంలో పనిచేసే ప్రభుత్వ, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతులలో పనిచేసే ఉద్యోగులకు వారాంతపు సెలవులు ఉన్నాయి కానీ పారిశుధ్య కార్మికులకు ఎందుకు వారాంతపు సెలవులు ఉండవని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు జెండావిష్కరణ చేయడానికి మున్సిపాలిటీ వారు అనుమతి ఇవ్వకపోవడంతో పక్కన ఉన్న ప్రైవేటు ప్రాంతంలో జెండావిష్కరణ చేయడం బాధాకరమన్నారు. మున్సిపల్ కార్మికులే లేకుంటే మున్సిపాలిటీలో ఉన్న పనులు ఏ విధంగా సక్రమంగా నడుస్తాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రస్తుతం ఉన్న పాలకులు, ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామపంచాయతీగా ఉన్నప్పటి నుంచి పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారిలో ఒక్కరిని కూడా పర్మినెంట్ చేయకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సీఐటీయూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని వారి సమస్యలపై నిర్విరామంగా పోరాటం చేస్తామని, మున్సిపల్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చడానికి చేసే పోరాటాలను ఉధృతం చేసి వారి హక్కులను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఆసిఫ్, పట్టణ కమిటీ అధ్యక్షులు జి.బాబు, ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ, కోశాధికారి బి.సుజాత, ఉపాధ్యక్షులు డి.సత్తయ్య, ఎం.జ్యోతి, ఏ.శ్రీలత, సహాయ కార్యదర్శులు జి.నర్సింలు, జి.సురేష్, కమిటీ సభ్యులు గజ్జెల బాబు, బి.సుగుణ, వి.భాగ్యమ్మ, యు.పుణ్యమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి, బుడిగే మల్లేష్, ప్రవీణ్, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- చిలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చీలపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. పార్టీలకు రహితంగా అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు తండాలకు సిసి రోడ్లు రహదారి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను, రైతు బీమా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిని మధు, ఆర్ఎన్ సంతోష్ కుమార్, అలుగుల సత్యనారాయణ నారా గౌడ్, దాచ సంగమేశ్వర్ జనార్ధన్, పిఎసిఎస్ చైర్మెన్ సంజీవరెడ్డి పెరుమాండ్ల గౌడ్, తహసీల్దార్ గ్రేసీ బాయ్ ఆర్ఐ శరణప్ప, పీఏసీఎస్ సీఈఓ రవీందర్, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిలపల్లి పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే.

పెద్ద శంకరంపేట మండల పరిధిలోని చిలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో తాగునీటి ఎద్దడి నెలకొందని పలు సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వివరించగా సమస్యలను పరిష్కరిస్తారని, హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్ , శ్రీనివాస్, ప్రమోద్, సంతోష్, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లోపమే ప్రమాదాలకు కారణం

- ఏఎస్పీ మహేందర్

నవతెలంగాణ-మెదక్ టౌన్



అవగాహన లోపం, అతివేగం, మద్యం, మాదకద్రవ్యాలను సేవించడం మొదలైన కారణాల వలన ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య భాగా పెరుగుతున్నాయని, ఏఎస్పీ మహేందర్ అన్నారు. ఈ మధ్యకాలంలో మెదక్ నుంచి నర్సాపూర్ వెళ్లే మార్గంలోనూ, మెదక్ నుంచి చేగుంట వెళ్లే మార్గంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి ప్రమాదాలను అవగాహన ద్వారా నివారించుకోవచ్చని ఏ దివాళి మై భారత్ వాలి, వారోత్సవాల సందర్భంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో మెదక్ పోలీస్ శాఖ సహకారంతో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అవగాహన ర్యాలీని నిర్వహించిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు, వాలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ర్యాలీ కొత్త బస్టాండ్ నుంచి రాందాస్ చౌరస్తా గుండా తిరిగి కొత్త బస్టాండ్ వరకు చేరుకున్నది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ రోడ్డుపై వెళ్లే వాహనదారులకు, రోడ్డుకు ఇరువైపులా గల దుకాణాదారులకు రోడ్డు భద్రతలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ కె హుస్సేన్ మాట్లాడుతూ చేతిలోని మొబైల్ ఫోన్‌కి స్క్రీన్ గార్డ్ వేయిస్తున్నారు, గాని ఎంతో విలువైన ప్రాణానికి రక్షణ ఇచ్చే హెల్మెంట్ ధరించలేకపోతున్నారన్నారు. ఈ నిర్లక్ష్యం వలన ప్రమాదానికి గురైన వారే కాకుండా ఆ కుటుంబంపై ఆధారపడిన వారందరూ కూడా దిక్కు లేని వారవుతున్నారని అవగాహన కల్పించారు. వాహనదారులు కచ్చితంగా రోడ్డు భద్రత నియమ నిబంధనలను అనుసరిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2, 3 ప్రోగ్రామ్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, మురళి వర్ధేల్లి, డాక్టర్ ఆర్ శ్రీలత యన్.సి.సి.కోఆర్డినేటర్ సురేందర్ రావు, ఇతర అధ్యాపకులు వెంకటేశ్వర్లు, బి.రాజు, నాగరాజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

ముగిసిన ఒకరోజు ట్యాలీ శిక్షణ

- ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్



నవతెలంగాణ-మెదక్ టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ట్యాలీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఒక రోజు శిక్షణ విజయవంతమైందని ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ట్యాలీ ప్రైవేట్ లిమిటెడ్ ఎడ్యుకేషన్ సంస్థ అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ తాటవర్తి మల్లేశ్వరం గుప్త, ట్యాలీ సాఫ్ట్ వేర్ పట్ల విద్యార్థులకు వివరించారు. మార్కెట్లో ఈ సాఫ్ట్వేర్ ను వ్యాపార సంస్థలు ఏ విధంగా నిర్వహిస్తున్నాయో, వాటి ప్రాముఖ్యతని వివరించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం అధ్యాపకులు జి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ట్యాలీ సబ్జెక్టులో నైపుణ్యాలను సాధిస్తే కలిగే ఉద్యోగ అవకాశాల గురించి వివరంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మరో వక్త డాక్యుమెంట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి మిలిటరీ సాయిలు మాట్లాడుతూ ట్యాలీ సబ్జెక్టులో విద్యార్థులకు ప్రాక్టికల్ గా కొన్ని మెలకువలను నేర్పించారు. వాణిజ్య శాస్త్రం శాఖధిపతి డాక్టర్ శరత్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ట్యాలీ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకున్నామని, ఈ సంస్థ ఆధ్వర్యంలో తమ విభాగం నిర్వహిస్తున్న ట్యాలీ సర్టిఫికెట్ కోర్సుకు తాను డైరెక్టరుగా, సమన్వయకర్తగా శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సర్టిఫికెట్ కోర్సు వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుమలరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, హరిత, నిదర్శిని, రఫిక్, బి చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

నవతెలంగాణ-పాపన్నపేట



ఉపాధ్యాయులు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని మెదక్ జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధాక్రిష్ణ అన్నారు. పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సురేందర్ గౌడ్, కోడపాక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, రంగారెడ్డిల పదవీవిరమణ సభకు డీఈవో హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపి వారి బంగారు భవిష్యత్తు నిర్మాణంలో ఈ ఉపాధ్యాయుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. పదవీ విరమణ పొందుతున్న సురేందర్ గౌడ్, రంగారెడ్డి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడవాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, మెదక్ మండల విద్యాధికారి నీలకంఠం మాజీ ఎంఈఓ మోహన్ రాజు, మాజీ జెడ్పిటిసి సభ్యులు లింగన్న గారి మల్లప్ప, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో బైకు కారు ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. వివరాలలోకి వెళితే స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట మండల పరిధిలో జడ్ చెరువు తాండాకు చెందిన రమావత్ శత్రు కుమారుడు అర్జున్(13) కామారెడ్డి జిల్లాలోని గాంధారిలో గిరిజన వసతి గృహంలో చదు వుకుంటున్నాడు. సెలవులు రావడంతో తన తండ్రి శత్రు వసతి గృహానికి వెళ్లి ఇంటికి తీసుక వస్తున్న క్రమంలో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటాడనే లోపు మృత్యువు వెంటాడింది. కారు రూపంలో బైక్ ఢీకొనగా అర్జున్ అక్కడికక్కడే మృతి చెందాడు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను విడుదల చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి
- కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ధర్నా

నవతెలంగాణ-మెదక్ టౌన్



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, అజయ్‌లు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్య రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్, అజయ్ లు మాట్లాడుతూ మెదక్ జిల్లాలో అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు సొంత భవనలు ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతి హాస్టళ్లను పర్యవేక్షణ చేయాన్నారు. విద్యార్థులకు గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమాన్యాలు కాలేజీలు నడపలేమని బంధు నిర్వహించి దీక్షలు చేపట్టారన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు విద్య రంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులలకు సొంత భవనాలు లేవన్నారు. అద్దె భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో భవనాల యజమానులు గేట్లకు తాళాలు వేసిన పరిస్థితి ఉందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా విద్యారంగ సమస్యల పైన స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్‌ను అలాగే స్కాలర్షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, జిల్లా కమిటీ సభ్యులు జగన్, నాయకులు అజయ్, కార్తిక్, భాను శ్రీకాంత్, సభ్యులు రేఖ, విజయ, అనిత, రాజు, వేణు పాలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- ప్రజల పక్షాన పోరాడే పార్టీ బీఆర్ఎస్

నవతెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ బట్టి జగపతిలు నాయకులు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా కేసీఆర్ నాయకత్వంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం వ్యతిరేకించారన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా తమ వాదనలోని సహేతుకత, న్యాయాన్ని ఈఆర్సీ గుర్తించి విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించిందన్నారు. ఇది తెలంగాణ ప్రజల విజయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కోకన్వీనర్‌లు గడ్డమీద కృష్ణ గౌడ్, కండెల సాయిలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, భీమరి కిషోర్ కుమార్, సుంకయ్య, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, సోహెల్, నాయకులు జయరాం రెడ్డి, సాదిక్ అలీ, సంగ శ్రీకాంత్, అజ్గర్, రాజు, కిరణ్, చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర కాలనిలో కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- 8 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.15 వేల నగదు చోరీ

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్



మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న పోలీస్ కానిస్టేబుల్ దంతెల సీమాన్ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడి ఎనిమిదిన్నర తులాల బంగారం.. 30 తులాల వెండి, రూ. 15వేల నగదు దొంగిలించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దంతెల సీమాన్ అల్లాదుర్గం పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు పెద్ద శంకరంపేటలో నివాసం ఉంటున్నాడు. పేట ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దంతెల సీమాన్ సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన అనంతరం మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి రాగా ఇంటి ముందర ఉన్న తలుపులు వేసిన వేసినట్లుగానే ఉన్నాయన్నారు. లోపల ఉన్న తలుపు తాళం పగలగొట్టి ఇంట్లోని బెడ్ రూమ్‌లోని బీరువా మొత్తం పగలగొట్టి అందులో ఉన్న బట్టలు చిందరవందరగా పడేయడంతో పాటు మూడు తులాల బంగారు నాను మూడు తులాల పుష్యలతాడు ఒక తులం బుట్ట కమ్మలు అర తులం బంగారు కమ్మలు 30 తులాల వెండి వస్తువులు వీటితోపాటు రూ.15 వేల నగదు గుర్తుతెలియని దొంగలు దొంగిలించారు. సంఘటన స్థలాన్ని అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి పేట ఎస్ఐ శంకర్ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. బాధితుడు సీమాన్ దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాసాయిపేటలో ఆయుర్వేద వైద్య శిబిరం

- ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి

నవతెలంగాణ-వెల్దుర్తి



ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ మాసాయిపేట మండల కేంద్రంలో మంగళవారం ధన్వంతరి ఆయుర్వేద వైద్యుని జన్మదిన సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది మన పూర్వీకుల నుంచి వచ్చిందన్నారు. గతంలో ధన్వంతరి అనే వైద్యుడు ఆయుర్వేదాన్ని కనుగొన్నాడని దానితోనే రోగాలను న్యాయం చేసేవాడన్నారు. 2016 నుంచి ధన్వంతరి అనే వైద్యుని జన్మదినం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఆయుర్వేద క్యాంపులు నిర్వహించాలని, సదుద్దేశంతో పై అధికారుల ఆదేశాల ప్రకారం మాసాపేట మండల కేంద్రంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మన సృష్టి ఏర్పాటు అయినప్పటి నుంచి ఆయుర్వేదాన్ని వాడేవారని గుర్తు చేశారు. కాలక్రమేన ఆయుర్వేదాన్ని వాడడం లేదని ఆయుర్వేదం వాడడం వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదని ఆమె సూచించారు. అనంతరం రోగిగ్రస్తులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో ధర్మాగ్రహదీక్ష చేపడతాం

నవతెలంగాణ-తూప్రాన్



ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన 4 డిఏలు, పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తహశీల్దార్ విజయలక్ష్మికి తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తపస్ మండల శాఖ బాధ్యులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 4 డిఏలు, ఈ-కుబేరులో ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ రిపోర్ట్ తెప్పించుకొని ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించి, అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచిన ఆర్థికపరమైన ప్రయోజనం కలగలేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విన్నవించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని పక్షంలో నవంబర్ 23న హైదరాబాదులో ధర్మాగ్రహదీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు భానుచందర్, కార్యదర్శి సంతోష్ కుమార్, జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, జిల్లా బాధ్యులు సంజీవ్, వేణు, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్మెంట్‌లు విడుదల చేయాలి

- అంబేద్కర్ ఎదుట ఎస్ఎఫ్ఐ దీక్ష



నవతెలంగాణ-సిద్దిపేట

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ ఎదుట పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఫీజు దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు చొప్పరి రవికుమార్ మద్దతు తెలిపి, పూలమాల వేసి దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆముదాల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.8300 కోట్లు పెండింగ్లో ఉన్నాయని, గత ప్రభుత్వం ఏడేండ్ల నిర్లక్ష్యంతో విడుదల చేయలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మోసం చేస్తు విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్రం లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల వల్ల రోడ్లు ఎక్కుతున్న పరిస్థితి ఉందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సిగ్గు తెచ్చుకొని విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులను ఏకం చేసి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్, జిల్లా సహాయకార్యదర్శి గుండా అరుణ్, జిల్లా నాయకులు తాడూరు భరత్ కుమార్, కోనేరు ప్రవీణ్, సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను, తదితరులు పాల్గొన్నారు.

కష్టాల అనుభవంతోనే సమాజం తెలుస్తుంది

- ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది
- కూర రఘోత్తమ్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

కష్టాలను ఎదురుకున్న వారికి సమాజం ఏమిటో తెలుస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి అన్నారు. మండలం మల్లుపల్లి ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధాన ఉపాధ్యాయుడు తెనుగుంటి భూమలింగం గౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భూమలింగం తన విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి ఎంతోమంది విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశాడన్నారు. ఈ సందర్భంగా భూమలింగం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లు ప్రభుదాస్, ప్రవీణ్ బాబు, అంజయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదాంను జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి మంగళవారం క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన తర్వాత లారీల్లో సెంటర్ల నుంచి వరిధాన్యం గోదాంకు వచ్చిన వెంటనే దిగుమతి చేసుకోవాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి ఎండి. జైనులోద్దీన్‌కి తెలిపారు. ఈ ఎఎంసీ గోదాంలో 6షెడ్ లకు, 1షెడ్ మాత్రమే ఖాళీగా ఉన్నదని, 5షెడ్‌ల్లో ఎమున్నాయో వివరాలు అందించాలని సుచించారు. అలాగే ధాన్యం ఎక్కువగా వచ్చే సూచనలు కనిపిస్తున్నందున షెడ్ లను అవసరమైనన్ని ఖాళిగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీల్లో తేమశాతం కోలిచే యంత్రంతో వడ్ల తేమశాతం చెక్ చేశారు. గోదాంలో ధాన్యం నిలవచేయడానికి అన్ని సేఫ్టి మెథడ్స్ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

దీపావళికి మట్టి దివ్వెలు వాడాలి

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

పట్టణ ప్రజలందరూ దీపావళి పండుగ సందర్భంగా దీపాలు వెలిగించుటకు మట్టి దివ్వెలు వాడాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో స్వచ్ దీవాలి శుభ్ దీవాలి అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి వేడుకల్లో బాణసంచాను తక్కువగా ఉపయోగించి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని సూచించారు. ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, వైస్ చైర్మెన్ అనిత రెడ్డి ,కౌన్సిలర్స్ నళిని దేవి, స్వర్ణలత, భాగ్య రెడ్డి, పద్మ సరోజన, సుప్రజ, పర్యావరణ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



నవతెలంగాణ-మర్కుక్

ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల హామీని వెంటనే అమలు చేయాలని మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ అన్నారు. మంగళవారం మర్కుక్‌లో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యా, వైద్యం ఉచితంగా అందివ్వాలని, ప్రతీ ఇంటికి రూ.2500 ఇస్తామన్న హామీని నిలుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లతీఫ్ ,తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ రికార్డుల తనిఖీ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో పంచాయతీ కార్యలయంలో మిషన్ భగీరథ నీరు సరఫరా విధానం, నిత్యం ప్రజలకు అందిస్తున్న మిషన్ భగీరథ నీరు వివరాల రికార్డులను మంగళవారం క్వాలీటీ కంట్రోల్ బోర్డ్ అధికారి గోపిచంద్ తనిఖీ చేశారు. మిషన్ భగీరథ నీరు సరఫరా వివరాలను నిత్యం విధిగా నమోదు చేయాలని గోపిచంద్ మిషన్ భగీరథ సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి, సూపర్ వైజర్ క్రాంతి కుమార్, పంచాయతీ సిబ్బంది సంపత్ పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



నవతెలంగాణ-గజ్వేల్

సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేయాలని మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్ నేతృతంలో నిర్ణయించి మంగళవారం సంతోష్ థియేటర్ సమీపంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో భూమి పూజ నిర్వహించారు. భాస్కర్ ఈ ప్రతిష్టకు రూ.20 వేలు, పెట్రోల్ బంక్ మేనేజర్ మిన్న కంటి ప్రసాద్ రూ.38 సాయం చేస్తున్నట్లు చెక్కును అందించారు. దీంతో నిర్వాహకులు యువత మరింత ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణ ప్రజలు పుర ప్రముఖులు ఆ కార్యక్రమానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇకనుంచి ఈ చౌరస్తాకు సుభాష్ చంద్రబోస్ చౌరస్తాగా నామకరణం కాబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య నారాయణ ధన్వంతరి జయంతి



నవతెలంగాణ-మిరుదొడ్డి

వైద్య నారాయణ ధన్వంతరి జయంతి పురస్కరించుకొని మిడిదొడ్డి మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వైద్య నారాయణ ధన్వంతరికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పయ్యావుల నరసింహులు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల కులానికి మూలపురుషుడు వైద్య నారాయణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పయ్యావుల రాములు, మంగలి ఆంజనేయులు, బండారి శేఖర్, పయ్యావుల బాలయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ పథకాలను కొనసాగించండి



నవతెలంగాణ-గజ్వేల్

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగించాలని బీఆర్ఎస్ గజ్వేల్ సీనియర్ నాయకులు బి. వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పథకాలతో అన్ని వర్గాలు లబ్ధి పొందినట్లు ఆయన గుర్తు చేశారు. అదే పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తే బాగుంటుందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గానికి కెసిఆర్ మంజూరు చేసిన రూ.170 కోట్లను తిరిగి కాంగ్రెస్ నాయకులు తీసుకువచ్చి నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలసిన నూతన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా అబ్దుల్ హమీద్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హెూదాలో హైదరాబాద్‌లోని ఎలక్షన్ సీఈఓ కార్యాలయంలో పనిచేసి బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పై పూర్తిగా అవగాహన తెచ్చుకొని జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు సమర్ధవంతంగా అందేలా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆయనకు సూచించారు. ఇప్పటివరకు పనిచేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి బదిలీపై ఖమ్మం జిల్లాకు వెళ్లారు.

క్యూబా ప్రజలకు అండగా నిలబడదాం

- క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ, నిర్భంధాన్ని ఖండిద్దాం
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

క్యూబా పై అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధాన్ని ఖండిద్దాం, క్యూబాకు అండగా నిలబడదాం అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గాంధీ సెంటర్‌లో అమెరికా సామ్రాజ్యవాద వాదానికి వ్యతిరేకంగా నిరసన తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 31 ఏండ్లుగా జనరల్ అసెంబ్లీ "క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య ఆర్థిక దిగ్బంధనానికి ముగింపు పలకాలి" అనే తీర్మానాన్ని అత్యధిక మెజారిటీతో ఆమోదించింది. గత 63 ఏండ్లుగా దిగ్బంధనం వల్ల క్యూబా ఆర్థికంగా 164.14 బిలియన్ డాలర్లను నష్టపోయింది. ద్రవ్యోల్బణం రీత్యా చూస్తే ఇది మొత్తం 1.499 ట్రిలియన్ డాలర్లు. ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు అమెరికన్లు క్యూబాకు ప్రయాణించటానికి జారీ చేసిన అవే ఆంక్షలు, నిబంధనలు అమెరికా అధ్యక్షులు బైడెన్ పరిపాలనలో కూడా కొనసాగుతున్నాయి. అమెరికా క్యూబాను తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంగా (ఎస్ఎస్ఓటీ)గా పరిగణిస్తున్నందున, ఇది క్యూబా యొక్క ఆర్థిక, బ్యాంకింగ్ లావాదేవీలు, విదేశీ వాణిజ్యం, ఆదాయ వనరులు, ఎనర్జీ , క్రెడిట్ లావాదేవీలకు తీవ్ర అవరోధం మారింది. క్యూబా ఆరోగ్య సంరక్షణ, ఆహారం, వ్యవసాయ రంగాలకు వర్తించే విధంగా అమెరికా ఉద్దేశపూర్వకంగా నిషేధాలు, పరిమితులను అమలుచేస్తున్నది. ఈ దిగ్బంధనం వల్ల సహకార సంఘాలు రైతులు వాడే యంత్రాల కోసం విడి భాగాలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర రవాణా సాధనాలు అందుబాటులో లేక వ్యవసాయం స్తంభించిపోయినది. అలాగే సాగులో లేని భూమిని ఉత్పత్తికి ఉపయోగించేందుకు వాడే ముడి పదార్థాలు లేక ఇతర ఉత్పత్తులు నిలిచిపోయాయి. క్యూబా నేడు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాదాపు మొత్తం ద్వీపంలోని 11 మిలియన్ల జనాభాలో 10 మిలియన్ల ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. క్యూబా ప్రజలు దైనందిన జీవితాన్ని గడపటానికి నిత్యావసరాల కొరత వల్ల అంతులేని కష్టాలు ఎదుర్కొంటున్నారు. అందుకని వారి సంఘీభావం తెలిపాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, బండి మల్లయ్య, సత్యనారాయణ, ప్రసాద్, ఎల్లయ్య, సతీష్, చందర్, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల కోర్ కమిటీ సమావేశం



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేటలోని బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్‌లో సోమవారం రాత్రి బహుజన ఉపాధ్యాయుల, ఉద్యోగుల బీసీ, ఎస్సీ, ఎస్టీ కోర్ కమిటీ సమావేశం జరిగిందని నంగునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ వెల్లడించారు. భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ కమిటీ సుదీర్ఘంగా చర్చించిందన్నారు. చర్చ అనంతరం కోర్ కమిటీ కన్వీనర్‌గా అన్నగోని సతీష్ గౌడ్, కమిటీ సభ్యులుగా గొట్టిపర్తి రామస్వామి గౌడ్, రాళ్ళబండి పద్మయ్య, పాసికంటి తిరుపతి, వనమా శ్రీనివాస్, బి. నర్సింహులు, భాస్కర్, గొర్రె మల్లిఖార్జున్, ఈ.సురేశ్ లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే కులగణన పకడ్బందీగా జరగాలని, ఆ కులగణన జరిగిన తర్వాత ఆ రిపోర్టును పబ్లిక్ డొమైన్ పెట్టాలని, కులాల సంఖ్యకు ప్రాతిపదికగా విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పర్సంటేజ్ ను పెంచాలని, చట్టసభలలో బీసీలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని, ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ అన్ని కులాలకు వర్తింపజేయాలని, మైనారిటీ ఓసిలను బీసీఈ నుండి తొలగించి, ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ కోటాలో ఇవ్వాలని పేర్కొన్నారు. డిమాండ్ల సాధన కొరకు రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఉద్యోగులు తమ హక్కులను రక్షించుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని చెప్పారు.

విలువలతో కూడిన జర్నలిజం కావాలి



- కోహెడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా హరీష్, ప్రధాన కార్యదర్శిగా జితేందర్



నవతెలంగాణ-కోహెడ

సంచలనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా సత్యమైన వార్తలకు జర్నలిస్టులు ప్రాధాన్యత ఇవ్వాలని, విలువలతో కూడిన జర్నలిజం నేటి రోజుల్లో అవసరమని సీనియర్ పాత్రికేయులు టీయూడబ్ల్యూజె రాష్ట్ర నాయకులు డాక్టర్ కోహెడ ప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పున్నం రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన కోహెడ ప్రెస్‌క్లబ్ రీజి. నెంబర్ 1051/2017 నూతన కార్యవర్గ ఎన్నికలు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఏకగ్రీవంగా మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ముల్కల హరీష్ (సాక్షి రూరల్), ప్రధాన కార్యదర్శిగా కొంకటి జితేందర్ (నవతెలంగాణ)లతో పాటు కార్యవర్గాన్ని ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఐజేయూకు అనుబంధంగా టీయూ డబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు. రానున్న రోజులలో మండల కేంద్రంలో కోహెడ ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్న ట్లు తెలిపారు. అలా గే ఉపాధ్యక్షులుగా వడ్డెపల్లి ప్రశాంత్ (వార్త), రాగుల సతీష్ (నవ్య న్యూస్), సహాయ కార్యదర్శి నంగునూరి కిరణ్ (పీపుల్స్ లీడర్), కోశాధికారిగా కెవై చారి (యదార్థవాది), ప్రచార కార్యదర్శిగా వట్టిపల్లి శ్రీనివాస్‌రెడ్డి (సూర్య), కార్యవర్గ సభ్యులుగా ఎండీ.సర్వర్ (దిశ), గుర్రాల రాజేందర్‌రెడ్డి (నినాదం), పాము నాగరాజు (తెలంగాణతేజ) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సూరుకొంటి శ్రీనివాస్‌రెడ్డి (ఈనాడు), గోరిట్యాల లక్ష్మణ్ (నమస్తే తెలంగాణ) తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-కొండపాక

గ్రామపంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో దుద్దెడ బస్టాండ్ ఆవరణలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పోరాట ఫలితంగా గత ప్రభుత్వము రూ. 8500 పెంచుతూ జీవో 51 తీసుకువచ్చి వారి పైన గుడిబండ వేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, అనేక వాగ్దానాలు చేసిందని నేడు వాటిని అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్మికులు అందరికీ కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని బీమా సౌకర్యం కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి ఈఎస్ఐ,పిఎఫ్, గుర్తింపు కార్డులు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు అమలు జరపాలని కోరుతూ నవంబర్ 6వ తేదీన జరిగే కలెక్టరేట్ ముందు ధర్నాను కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అప్పటికి తమ సమస్యలు పరిష్కరించకపోతే నవంబర్ 20 నుంచి 25 వరకు ఎప్పుడైనా సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బర్మ కొమురయ్య, మండల అధ్యక్షులు పల్లె శ్రీనివాస్, నాయకులు ఆరుట్ల నర్సింలు, గొడుగు నారాయణ, దొబ్బేట సుధాకర్, రాజు, పిల్లి లచ్చవ్వ, నాగవ్వ పాల్గొన్నారు.

మేలిమి రకాల నారు మడితో అధిక లాభాలు



- జినేక్స్ సీడ్ రిజినల్ మేనేజర్ కోటిరెడ్డి

నవతెలంగాణ-మిరుదొడ్డి

నారుమడి చేసుకునే ముందు మేలిమి రకాలతో నారు మడిని చేసుకున్నట్లయితే మంచి దిగుబడుతో పాటు అధిక లాభాలు అర్జించవచ్చని జినేక్స్ సీడ్ రిజినల్ మేనేజర్ కోటిరెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో మంగళవారం జీనేక్స్ సీడ్స్ ఇండియా సౌజన్యంతో రీసెర్చ్ వరి రోలెక్స్009 దొడ్డు రకం వరి పై అవగాహన కల్పించారు. మండల కేంద్రానికి చెందిన బాలయ్య అతని సొంత భూమిలో 5 ఎకరాల్లో ఆ వరి సాగు చేయగా అధిక దిగుబడి రావడంతో ఆ సంస్థ వారి ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాల్లో దాదాపు 200 రైతులతో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆ రైతుని ఆ సంస్థ వారు సన్మానించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ జినేక్స్ సీడ్స్ ద్వారా ఆ దొడ్డు రకం వరి సాగు చేయడంతో అధిక దిగుబడి, ఎకరానికి దాదాపు 35 నుంచి 40 క్వింటాళ్లు వస్తుందని రైతులకు తెలిపారు. జినేక్స్ సీడ్స్ లో వరి, మొక్కజొన్న, పత్తి, వివిధ రకాల విత్తనాలు లభిస్తాయని రైతులకు జినేక్స్ సీడ్స్ కంపెనీ రీజినల్ ఆఫీసర్ వివరించాడు. పంటల్లో వచ్చే పురుగుల గురించి దోమల మచ్చల గురించి తెగుల గురించి రైతులు నష్టపోకుండా సలహాలు, సూచనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, రామాంజనేయ ఫర్టిలైజర్ యజమాని బాలకిషన్ ఏరియా ఆఫీసర్సు నవీన్, బాల్ రెడ్డి, వివిధ గ్రామాల రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక సాధికారతే లక్ష్యం



నవతెలంగాణ-గజ్వేల్

మహిళ ఆర్థిక సాధికారత లక్ష్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసుదేవ అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో మహిళా సమైక్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూక్ష్మహారా ఉత్పత్తి తయారు సంస్థల క్రమబద్ధీకరణ పథకం ముందుకు సాగుతుందని దీని ద్వారా లబ్ధిదారులు లబ్ధి పొందుతారని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మహిళా సంఘాల సభ్యులు స్థాపించి స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో తమ బాధ్యతను పోషించాలని మహిళా సంస్థల లక్ష్యం అన్నారు. మంచి ప్యాకింగ్ మంచి బ్రాండ్ పరిశుభ్రతతో తయారు చేస్తే మార్కెటింగ్ సౌకర్యం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మహిళలకు 35శాతం సబ్సిడీ వర్తిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్డు సేఫ్టీ ఇండియా ట్రైనింగ్ పార్ట్నర్ రఘువరన్ బృందం, ఏపీఎం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంతో మానసిక ఉల్లాసం



- సీనియర్ అడ్వకేట్ గుండు కాళీప్రసాద్

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప నగర్ కాలనీలో వినాయక సేవా సమితి సభ్యులు రిమ్మనగూడలో ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించుకున్నారు. గజ్వేల్ కోర్టు సీనియర్ అడ్వకేట్ కాళీప్రసాద్ హాజరై మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం లతో కుటుంబ సభ్యులకు శారీరక, మానసిక ఉల్లాసాన్నిస్తాయన్నారు. సభ్యుల మధ్య ఐక్యత పెరగడం వలన ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చని అన్నారు. రిటైర్డ్ వార్డెన్ స్వర్గం రాజేశం మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు చేసుకోవడం మంచి సాంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపి, ఆటలు ఆడిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మెన్ వెంకన్న గారి వెంకట నరసింహారెడ్డి, అధ్యక్షులు మోతే వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, కోశాధికారి అలివేలు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు గుజ్జేటి రామచంద్రం, రేకుల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శులు రేకుల అంజి రెడ్డి, వగ్గు మల్లేశం, అంకన్నగారి గోపాల్ రెడ్డి, సేవాసమితి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ కొరకు తల్లిదండ్రుల ఎదురుచూపులూ..



నవతెలంగాణ-గజ్వేల్

తమ రాజకీయ పరపతి, అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎంతో కొంత సాయం చేయాలని ఎన్నికల ముందు నజరానలు ప్రకటిస్తారు. ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది క్రితం ఎన్నికల ప్రచారంలో ముఖ్యంగా మహిళలకు కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్ స్థానాల్లో కొత్త పథకాలు తీసుకొచ్చి కొంత ఆదుకుందామని ప్రయత్నం కోసం ప్రకటించిన అవి ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. ఈ పథకాలు వేరే పేరుతో అమలు చేస్తూ అదనంగా మరో తులం బంగారం ఇద్దామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు కురిపించి చేతులు దులుపేసుకుంది. గత ప్రభుత్వంలో షాది ముబారక్, కళ్యాణ్ లక్ష్మి పథకానికి. రూ 1,00,116 వేల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఆరు నెలల్లోపు పెళ్లి చేసిన కుటుంబానికి అందజేసే ప్రయత్నం చేశారు. పది ఏండ్లు సాఫీగా నడిచిన ఈ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కుడిదిలో పడ్డ ఎలుకగా మారిపోయింది. పథకాల పేరు మార్చుతామని చేతులెత్తేసినట్లు కనిపిస్తుంది.

సిద్దిపేట జిల్లాలో ఎదురుచూపులు

జిల్లాలో వేలాది సంఖ్యలో పెళ్లిళ్లు జరిగి ఆన్లైన్లో దరఖాస్తులు పెట్టుకున్న కొత్త జంటలు కాంగ్రెస్ కొత్త కోరికలను అమలు చేస్తుందేమని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏడాది లోనే జిల్లాలో మొత్త జంటలు సెప్టెంబర్ 31 నాటికి 6'759 పెళ్లిళ్లు జరగగా ఇప్పటివరకు 4,164 జంటలు మాత్రమే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం సాయం కోసం తల్లిదండ్రులు ఆశగా చూస్తున్నారు. అంతేకాకుండా తులం బంగారం విషయం లోను, ఏడాదికావస్తుంది అంటూ పెళ్లి చేసిన తల్లిదండ్రులు ప్రశ్నించడం కనిపిస్తుంది. దీంతో కాంగ్రెస్ నేతల మొఖం చాటేస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న వాటి విలువ రూ41.48 లక్షల చెక్కుల రూపంలో ఇవ్వవలసింది.

- **గజ్వేల్ డివిజన్ పరిధిలో కళ్యాణ లక్ష్మి చెక్కులు 1242, షాది ముబారక్ చెక్కులు 103**
- **సిద్దిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో కళ్యాణ్ లక్ష్మి 2040, షాది ముబారక్ 156**
- **హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్లో కళ్యాణ లక్ష్మి 600, షాది ముబారక్ 23**

ఆడబిడ్డల పెళ్లిళ్లు చేసి తల్లిదండ్రులకు కొంత అప్పు భారం కావడం వల్ల కొంతలో కొంతైనా భారం తగ్గుతుందని చిన్నచిన్న అప్పులు తీరుతాయని ఆశించి ఈ పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వ పథకాల కోసం ఆశపడని కుటుంబాలు దాదాపు 300కు పైగానే ఉంటాయని పెద్దలు చెప్తున్నారు. పేదలు పెట్టుకున్న దరఖాస్తులకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి చెక్కులు అందించాలని ఆడబిడ్డల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

కాంగ్రెస్ పథకాలకు మెండుగా ప్రజాదరణ

నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు మెండుగా ప్రజాదరణ పొందుతున్నాయని కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ నాయకులు డప్పు గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో ఉన్న పథకాలు ఇప్పటి వరకు అమలు అవుతున్నవి అన్ని మంచి ఆదరణ పొందుతున్నాయి. ఈ ఆదరణతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కేవలం విమర్శలకే పరిమితమైనట్లు అన్నారు.

ఉపాధ్యాయ వృత్తి దేశ భవితకు విత్తన బండాగారం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

ఉపాధ్యాయ వృత్తి దేశ భవితకు విత్తన బండాగారమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, అన్నారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో మద్దూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూరుగు శ్రీశైలం, పదవి విరమణ కార్యక్రమాన్ని. పీఆర్టీయు మండల అధ్యక్షుడు కామిడీ శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై శ్రీశైలం భాగ్యలక్ష్మి దంపతులను శాలువా మెమొంటలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాతలైన ఉపాధ్యాయులు వృత్తికి వన్నె తీసుకురావాలన్నారు. ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి సహజమని. ఉపాధ్యాయునిగా బూరుగు శ్రీశైలం, అందించిన సేవలు ఎనలేనివని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, రిటైర్డ్ ఎంఈఓ నరసింహారెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్ శర్మ, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు నాగేందర్, వంగ శ్రీనివాసరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చల్ల కరుణాకర్, చేర్యాల, దూళ్మిట్ట, మండలాల అధ్యక్షులు కేవీఎస్ రెడ్డి, వంగ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సార్ల వాడలో పోలీస్ పికెటింగ్




నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సార్లవాడలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ప్రార్థన మందిరాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారన్న విషయంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసు అధికారులు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ విషయంలో పోలీసు అధికారులు రెండు రోజుల నుంచి విచారణ చేస్తున్నారు.

క్యూబాపై అమెరికా నిర్బంధాన్ని ఎత్తివేయాలి



- సంఘీభావంగా దుబ్బాకలో సీఐటీయూ ప్లకార్డులతో ప్రదర్శన

నవతెలంగాణ-దుబ్బాక

క్యూబా పై అమెరికా విధించిన వాణిజ, ఆర్థిక నిర్బంధాన్ని వెంటనే ఎత్తివేసేలా ఐక్యరాజ్యసమితిలో తీర్మానం చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ డిమాండ్ చేశారు. క్యూబా పై అమెరికా అవలంబిస్తున్న సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధాన్ని ఖండిస్తూ సీఐటీయూ ఇచ్చిన దేశవ్యాప్త సంఘీభావ ప్రదర్శనలో భాగంగా మంగళవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ, క్యూబా పై అమెరికా ఉద్దేశపూర్వకంగా నిషేధాలు, నిర్బంధాలను కొనసాగిస్తుందని విమర్శించారు. దీని ఫలితంగా అక్కడి ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు, చికిత్సలకు వినియోగించే మందులు, ఇతర పరికరాలు కొరత ఏర్పడడమే కాకుండా నేడు క్యూబా అతిపెద్ద ఇంధన సంక్షోభం ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 28, 29 తేదిల్లో జరగబోవు ఐక్యరాజ్యసమితి సాధారణ సమావేశాల్లో క్యూబా పై అమెరికా నిర్బంధాలను ఎత్తివేసేలా ప్రపంచ దేశాలు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు కొంపెల్లి భాస్కర్, బత్తుల రాజు, మెరుగు రాజు, మల్లేశం, సాజిత్, లక్ష్మీనర్సయ్య, రమేష్, సాయికుమార్ పలువురు పాల్గొన్నారు

ఎంపీకి ఘనంగా స్వాగతం పలికిన పూజల హరికృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేట



హైదరాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం కొరకు వెళ్తున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ని సిద్దిపేట పొన్నాల వై జంక్షన్ దగ్గర సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరి కృష్ణ స్వాగతం పలికి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సిద్దిపేటలో బీఆర్ఎస్ పతనం అయితుందని, కాంగ్రెస్ రోజు రోజుకు బలోపేతం అవడం హర్షించే విషయం అని, ఈ సందర్భంగా నియోజకవర్గ హరి కృష్ణ ని అభినందించారు. ఇంకా పార్టీ పటిష్టం కోసం కృషి చేయాలనీ కోరారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలని సిద్దిపేట కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మైనారిటీ నాయకులు కాలీముద్దీన్, పూజల గోపి కృష్ణ, సందీప్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

అప్పాల శ్రీకాంత్ పటేల్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని కాశిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన అప్పాల శ్రీకాంత్ పటేల్ హైదరాబాదులోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో ఎన్విరా న్మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో విభాగంలో పరిశోదనాలకు గాను యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేసారు. మంగళవారం ఆయన ప్రకటనలో మాట్లాడుతూ 2012 లో పీహెచ్‌డీలో చేరి ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని పట్టుదల, కృషితో విద్యను పూర్తి చేశానని నా గైడ్ డాక్టర్. ప్రమోద్ కుమార్ అని డాక్టరేట్ తన చిన్నప్పటి కళ అని, తనకి డాక్టరేట్ రావడం ఎంతో సంతృప్తి నీచ్చిందని అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

పంచతంత్ర పాఠశాలలో ఉచిత దంత వైద్య పరీక్షలు

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పట్టణ కేంద్రంలోని పంచతంత్ర పాఠశాలలో మంగళవారం తెలంగాణ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ సిద్దిపేట్ డాక్టర్ అరవింద్ కుమార్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.శిబిరాన్ని ఎస్ఐ పి. నీరేష్ ప్రారంభించి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషదాయకమని అన్నారు. దంత వైద్య పరీక్షలలో సుమారు 200 మంది పాల్గొన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్యామల తెలిపారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎస్ఐ, డాక్టర్ కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం సిర్సన గండ్ల గ్రామానికి చెందిన పొన్నం కొండయ్య (50) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొండయ్య పది నెలల క్రితం కూతురు అర్చన పెళ్లి కోసం అప్పులు చేశాడు. వాటికి తోడు తాగుడుకు బానిసైన ఆయన మంగళవారం మద్యం సేవించి గ్రామంలో గల ఊర చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. చెరువు సమీపంలో ఆయన చెప్పుల ఆధారంగా అనుమానం వ్యక్తం చేసి నీటిలో గజ ఈతగాళ్ల సహాయంతో వెతకగా మృతదేహం లభ్యమయింది. మృతదేహన్ని శవ పరీక్ష నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తల్లి లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఆయనకు భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు.

ప్రయాణికురాలిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడి

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలంలో ప్రయాణికురాలిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం సాల్వాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నరసింహులు ఆదివారం అదే గ్రామానికి కాలినడకన వెళ్తున్న యువతని తాను కూడా సాల్వాపూర్ గ్రామానికి వెళుతున్నానని నమ్మబలకి ఆటోలో యువ తిని ఎక్కించుకొని సాలాపూర్ గ్రామానికి బయలుదేరాడని తెలియజేశారు. వట్టిఎ ల్లి నుంచి సాల్వపూర్ మధ్యలో కొద్ది దూరం వెళ్లినా అనంతరం నిర్మానుష్యమైన ప్రదేశంలో ఆటోను ఆపి బలవంతన యువతిని పొదలలోకి తీసుకెళ్లి లైంగిక దాడినికి పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటుతూ.. జన్మదిన వేడుకలు

-మోడల్ స్కూల్ విద్యార్థి వినూత్న ఆలోచన



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న యశ్వంత్ తన జన్మదిన సందర్భంగా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన ప్రయత్నం పలువురికి ప్రేరణగా నిలుస్తుందని ఇంచార్జి ప్రిన్సిపాల్ రాదారి నాగరాజు అన్నారు. మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు 18 రకాల పూలు, పండ్ల మొక్కలను అందించాడన్నారు.ఈ సందర్భంగా విద్యార్థి యశ్వంత్ ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ పుస్తకాన్ని బహుకరించారు. ఉపాధ్యాయులు జ్యోతి, సుమన్, లత, నరేష్, యాదిలక్ష్మి, కళ్యాణి, కల్పన, రాజు ఉన్నారు.

నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు

- దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్

నవతెలంగాణ-రాయపోల్



ఈత కల్లు దొంగతనం సంఘటనలో తీవ్ర మనస్థా పానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన కేసు విచారణ చేపట్టి కారకులైన నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగిందని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో ముత్యాల ఆంజనేయులు ఈతకల్లు దొంగతనం చేశాడని గ్రామపంచాయతీ వద్ద పంచాయ తీ నిర్వహించి అతనిపై దాడి చేసి రూ.2 వేలు జరిమానా విధించారు. ఈ సంఘటనలతో చేయని నేరానికి నాపై నిందమోపి తీవ్రంగా అవమానించారని మనస్థాపం చెంది ఆంజనేయులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆంజనేయులు మృతికి కారణమైన తోడంగి స్వామి, తోడంగి ఆంజనేయులు, ఈరంగారి ఎల్లం, తోడంగి పరశురాములు, తోడంగి స్వామి, తోడంగి రామ చంద్రం, తోడంగి కరుణాకర్‌ల పై ఫిర్యాదు చేయగా కేసు విచారణ చేపట్టి పై ఏడుగురిని గజ్వేల్ కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించడం జరిగిందన్నారు. కాబట్టి మంగళవారం పైన తెలిపిన ఏడుగురిని రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు.

హన్మంతరావుకు స్వాగత శుభాకాంక్షలు

నవతెలంగాణ-మర్కుక్



యాదాద్రి - భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా హన్మంతరావు మంగళ వారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మర్కుక్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ అచ్చం గారి భాస్కర్, మర్కుక్ మండల నవతెలంగాణ రిపోర్టర్ జాలని యాదగిరి యాదాద్రి - భువనగిరిలో జిల్లాలో ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్చాన్ని అందజేసి స్వాగత శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దామరకుంట బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ లతీఫ్ తదితరులున్నారు.

నిరుపేదల వైద్యంపై నిర్లక్ష్యం

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అందించే వైద్యంపై నిర్లక్ష్యం వహిస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలు, డాక్టర్ల కొరతపై కనీసం సమీక్ష సమావేశాలు నిర్వహించడం లేదని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి ఆసుపత్రిలో డాక్టర్ల కొరత, వసతులు, సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో పలు వివరాలు సేకరించి వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టరుతో ఫోన్లో మాట్లాడి వాటి గురించి చర్చించారు. అంతకుముందు రోగులను పరామర్శించడంతో పాటు డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పెరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందేలా అప్పటి సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలపై కనీసం సమీక్ష సమావేశాలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం అయ్యే మహిళలకు ఆడబిడ్డ పుడితే రూ. 12వేలు, మగ శిశు వు పుడితే రూ.10వేలు ఆర్థిక సాయం అందించేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని కూడా తొలగించి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసూతులను తగ్గించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంపై దృష్టి పెట్టాల న్నారు. చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సదుపాయాల కోసం పూర్తి వివరాలతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని కలవడంతో పాటు ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప, వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, మాజీ ఎంపీపీ కరుణాకర్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు అనంతుల మల్లేశం, ఎం.నాగేశ్వర్ రావు, బీఆర్ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గదరాజు చందు, జింకల పర్వతాలు యాదవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తాకుతున్నా పట్టించుకోరా..?

- మాల మహానాడు జిల్లా యూత్ కార్యదర్శి శ్రీకాంత్

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మున్సిపల్ పరిది .లోని రెండో వార్డులో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకుతు న్నాయని, దీనితో ప్రాణభ యం ఉందని, ఆ వార్డులో పేరుకుపో యిన సమస్య లను పరిష్కరిం చాలని అనేకసార్లు ఆ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికా రులకు చెప్పినప్ప టికీ పట్టించు కోవడం లేదని మాల మహానాడు యూత్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చందా శ్రీకాంత్ అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసలే ప్రాణాంతక కోనోకార్ప్ చెట్లని వాటి ద్వారా శ్వాస కోశ సంబంధ సమస్యలు వస్తున్నాయని ఈ సమస్యను గత 6 నెలల నుంచి కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు కౌన్సిలర్ కనుసన్నల్లో నడుస్తూ సమస్యలను గాలికి వదిలేశారని, అధికారులకు పన్నుల వసూలు పైన ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదని, ఇప్పటికైనా చెట్లను తొలగించి వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీపీఐ(ఎం) మండల మహాసభలను జయప్రదం చేయండి

- సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

సీపీఐ(ఎం) కొమురవెల్లి మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మండల మూడవ మహాసభలు నవంబర్ 12న ఐనాపూర్ గ్రామంలో నిర్వహిస్తామని అందుకు పార్టీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని చెప్పారు. అనంతరం డిసెంబర్ 1, 2 తేదీల్లో సిద్దిపేట జిల్లా మూడోమాసభలు గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తామని పార్టీ శ్రేణులు కార్యకర్తలు, పార్టీ అభిమానులు సమన్వయపరచుకోవాలని తెలిపారు. దేశవ్యాప్తంగా భూ ఉద్యమాలను రైతాంగ, కార్మిక, పోరాటాలను నిర్వహించిన ఘనత పార్టీకే దక్కుతుందని కొనియాడారు. ప్రపంచంలోనే అనేక సమస్యల పరిష్కారానికి ఎర్ర జెండానే మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. రాబోయే కాలమంతా ఎర్రజెండాదే నని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు నిరంతరం సైనికుల్లా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్టారెడ్డి, మండల నాయకులు తేలు ఇస్తారి, మల్లేశం, వుల్లంపల్లి సాయిలు, బక్కెల్లి బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధాన్ని ఖండిద్దాం

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ



నవతెలంగాణ-చేర్యాల

క్యూబా పై అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధాన్ని ఖండిద్దాం, క్యూబాకు అండగా నిలబడదామని సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. క్యూబా పై అమెరికా సామ్రాజ్య వాద నిరంకుశ నిర్బంధం పై సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 31 ఏండ్లుగా జనరల్ అసెంబ్లీ "క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక దిగ్బంధనానికి ముగింపు పలకాలి" అనే తీర్మానాన్ని అత్యధిక మెజారిటీతో ఆమోదించిందన్నారు. గత 63 ఏండ్లుగా దిగ్బంధనం వల్ల క్యూబా ఆర్థికంగా 164.14 బిలియన్ డాలర్లను నష్టపోయిందని తెలిపారు. ద్రవ్యోల్బణం రీత్యా ఇది మొత్తం 1.499 ట్రిలియన్ డాలర్లు అని ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు అమెరికన్లు క్యూబాకు ప్రయాణించటానికి జారీ చేసిన అవే ఆంక్షలు, నిబంధనలు అమెరికా అధ్యక్షుడు బైడెన్ పరిపాలనలో కూడా కొనసాగుతున్నాయన్నారు. ఈ నిబంధనల కారణంగా ఆహార దిగుమతులు తగ్గిపోయా యన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ చేర్యాల పట్టణ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్, మండల కన్వీనర్ రేపాక కుమార్, మున్సిపల్ కార్మికులు యాదగిరి, రాజు, ప్రభాకర్, బిక్షపతి, ప్రశాంత్, భాగ్య, లక్ష్మీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ జాన్‌రీ, డి.ఎస్ చౌహాన్



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

ధాన్యం కొనుగోలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, అనేక అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర పౌర సరఫరా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ జాన్ రీ, డి.ఎస్, చౌహాన్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై మిల్లర్లతో ఆయా జిల్లాల అధికారులు సమావే శాలు నిర్వహించి మిల్లింగ్ లో సమస్యలు తలెత్తకుండా చూసుకో వాలన్నారు. మిల్లింగ్ అగ్రిమెంట్ లేకుండా ఎవరికి అలకేషన్ చేయకుడదని, జిల్లాలో ఎక్కడ మిల్లింగ్ తక్కువగా జరుగుతుందో తెలుసుకోని అక్కడ తనిఖీలు నిర్వహించి మిల్లింగ్ వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లు, అక్రమాలు జరగకుండా ప్రభుత్వ ఎన్ఫోర్స్మెంట్ వంటి వాటి ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఎక్కడైన తప్పులు జరిగినట్లు గుర్తించినట్లయితే భాద్యులపై కఠిన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, ఇతర వివరాల అన్ లైన్ నమోదులో ఆలస్యం జరగకుండా చూడాలని, మాయిశ్చర్, ఎఫ్.ఎ.క్యూ ప్రమాణాలను పాటించడంతో పాటు తాలు, తరుగు లేకుండా చూసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట వ్యవసాయ శాఖ అధికారుల సహకారాన్ని తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు పై ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులను జారీ చేసినందున ఆట్టి ఆదేశాలకు తగ్గట్టుగా వందశాతం కొనుగోలు జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా మా దృష్టికి తీసుకు వచ్చే సమస్యలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) అబ్దుల్ హమీద్, సివిల్ సప్లై డిఎం. ప్రవీణ్, సివిల్ సప్లై అధికారి తనూజలు పాల్గొన్నారు.

సిరసనగండ్ల విద్యార్థులకు చేతి వ్రాతపై శిక్షణ

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం సిరసనగండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం చేతివ్రతపై శిక్షణ ఇచ్చారు. చేతి రాత బాగుంటేనే మంచి మార్కులు సాధించవచ్చనే ఉద్దేశంతో చేతివరాతపై శిక్షణ ఇప్పించారు. మద్దుల గోపాలకృష్ణ మూర్తి మద్దుల తాయారమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు మద్దుల వెంకటరమణ, కోడలు స్వర్ణలత సౌజన్యంతో గడ్డం యాదగిరి, గొట్టిముక్కుల బ్రహ్మాచారిలు విద్యార్థిని విద్యార్థులకు అందమైన చేతి వ్రాత పై శిక్షణ యిచ్చారు. ఈ కార్యక్రమానికి అనుసంధాన కర్తగా స్థానిక గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ వ్యవ రించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సరిపోయే చేతిరాత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు పెద్ది విఠల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ స్వరూప, సీనియర్ ఉపాధ్యాయులు రాజిరెడ్డి, పొన్నా ల తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రైతులకు బేడీలు వేసిన చరిత్ర సతీష్ కుమారుదే

- అభివృద్ధిని ఓర్వలేకే ఆరోపణలు
- కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఐలయ్య



నవతెలంగాణ-అక్కన్నపేట

గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసిత రైతులకు బేడీలు వేసిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌దే అని అక్కన్నపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత రెండు పర్యాయాలు హుస్నాబాద్ ప్రాంతం ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని, సీఎం దగ్గరి మనిషి అని అనుకునే మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ హుస్నాబాద్ కు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం కూడా గడవక ముందే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. అభివృద్ధిని చూడలేకే మాజీ ఎమ్మెల్యే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సతీష్ కుమార్ మాట్లాడే ముందు కాస్త ఆలోచన చేసి మాట్లాడాలని, ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ ప్రాజెక్టులు పూర్తి చేశారని, కానీ సతీష్ కుమార్ పరిధిలో ఉండే గౌరవెల్లి ప్రాజెక్టును మాత్రం మూలన పడేసారని, ఇక్కడ నిర్వాసితులను మోసం చేసి అర్ధరాత్రి పోలీస్ పహారాలో నిర్వాసితులను వెళ్లగొట్టిన చరిత్ర మీదని గుర్తు చేశారు. సతీష్ కుమార్ పదే పదే మంత్రిని విమర్శించడం మానుకోవాలని, లేదంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ఎండీ అక్బర్, ఎల్లయ్య, బెజ్జంకి సారయ్య కరెంటోతు రవి, పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న మంద లక్ష్మణ్

- బేగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

అన్ని దానాలకంటే విద్యాదానం మహా గొప్పదని అలాంటి విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సహకారం అందిస్తూ దాతృత్వం చాటుకున్న మంద లక్ష్మణ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని బేగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులు, టై బెల్ట్, అంగన్వాడి కేంద్రాలకు ఫర్నిచర్, ఫ్యాన్, ట్యూబ్ లైట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తే ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల కంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులే విద్యనభ్యసిస్తారని అలాంటి వారికి గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు అందరూ సహకారం అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. పాఠశాల అభివృద్ధి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషి చెయ్యాలనే సంకల్పంతో 65 మంది విద్యార్థులకు అందజేయడం జరిగిందన్నారు. దాతృత్వంతో పాఠశాల అభివృద్ధికి సహకరించిన మంద లక్ష్మణ్ ను పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు ప్రత్యేకంగా అభినందించి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిహర ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సౌజన్య, పంచాయతీ కార్యదర్శి మాధవి, అంగన్వాడీ టీచర్లు సరస్వతి, పున్నమ్మ, సిఆర్పి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సాగిన గాయకుల ఎంపిక

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని శివానుభవ మండపంలో నూరేండ్ల నా ఊరు గేయ కావ్యానికి గాయని, గాయకుల ఎంపిక కార్యక్రమం ఉమ్మడి మెదక్ జిల్లా కళాకారుల సమక్షంలో విజయవంతంగా జరిగింది. సుమారు 100 ఏండ్ల క్రితం తెలంగాణ పల్లెల జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలను అద్దం పట్టే విధంగా 243 చరణాల గేయ కావ్యాన్ని రచించారు. ఈ పాటను 243 మంది గాయకులతో పాడించి నూతన చారిత్రక కార్యక్రమం చేయాలని నిర్ణయంతో తెలంగాణలోని నలుమూలల నుంచి గాయకుల ఎంపిక కార్యక్రమాలు చేస్తూ వస్తున్న నేపథ్యంలో మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఉమ్మడి మెదక్ జిల్లా గాయకుల ఎంపిక నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా రచయిత వరంగల్ శ్రీనివాస్ వ్యవహరించారు. వరంగల్ శ్రీనివాస్ ను స్థానిక కళాకారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు చికోడు నరసింహులు, మర్పడుగ యాదగిరి, వెంకటాపురం రవి, ముక్కపల్లి శ్రీనివాస్, డప్పు బాబు, వివి కన్నా, గోల్కొండ బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓల సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-రాయపోల్



రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన ఏఈఓలను వెంటనే విధులలోకి తీసుకోవాలని దౌల్తాబాద్ ఏఈఓలు సంతోష్ కుమార్, శిరీష, సునందలు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రం రైతు వేదికలో రైతు నేస్తం-వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో మండలంలోని ఏఈఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి నేల పై కూర్చొని నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అయిన డిజిటల్ క్రాప్ సర్వే దేశంలో 11 రాష్ట్రాలలాగా మన రాష్ట్రంలో కూడా ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చి 1000 ఎకరాలకు ఒక వ్యక్తిని మించకుండా చేయాల్సింది. అందుకుగాను ప్రతి ఫారంకు నిధులు కూడా వచ్చాయి. ఇవే నిధులను మిగితా 11 రాష్ట్రాల ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చి చెపిస్తున్నాయి. కానీ ఇందుకు భిన్నంగా మన రాష్ట్ర వ్యవసాయ శాఖలో వ్యవసాయ ముఖ్యకార్యదర్శి, కమిషనర్ మన రాష్ట్రంలో ఈ పనిని ఇదివరకే వివిధ పథకాలు, శాఖ పరమైన విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులను బలవంతంగా చెపించడాన్ని పై అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్న తరుణంలో ఈ డిజిటల్ క్రాప్ సర్వేకే సంబంధంలేని రైతు భీమా పథకాన్ని బూచిగా పెడుతూ రాష్ట్రంలో అమాయకులైన 165 మందిని సస్పెండ్ చేయడం జరిగింది. ఇట్టి నకిలీ సస్పెన్షన్స్ ను రద్దు చేయాలని అక్టోబర్ 23 న వ్యవసాయ డైరెక్టర్‌ను కలిస్తే అదే రోజు సాయంత్రంలోగా సస్పెన్షన్ రద్దు చేస్తామని, ఇప్పటి వరకు కూడా రద్దు చేయలేదన్నారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ వెంటనే సస్పెన్షన్స్ రద్దు చేయాలని నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. ఏఈఓలను ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. కేవలం పై అధికారుల ధోరణికే వ్యతిరేకం అన్నారు.

220 నాణాలతో దీపావళి జ్యోతి అద్భుత చిత్రం

నవతెలంగాణ-గజ్వేల్

దీపావళి పండుగ సందర్భంగా గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వినూతన ఆలోచనతో నాలుగు దశబ్దాల క్రితం ఆనాటి అరుదైన 20 పైసలు (1985 నాటి) 220 నాణాలు ఉపయోగించి దీపావళి జ్యోతిని 5 అడుగుల పొడవుతో అద్భుతంగా రూపొందించి రామకోటి కార్యాల యంలో మంగళవారం ఆవిష్కరించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవ స్థాపక, అధ్యక్షులు సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటిని ప్రాలద్రోలి వెలుగును నింపేదే దీపావళి అన్నారు. 30 ఏండ్ల నుంచి ఎన్నో చిత్రాలను చిత్రించానని వాటికి విభిన్నంగా ఉండాలని మన కంటికి కనిపించని అరుదైన ఆనాటి 20పైసల నాణాలను సేకరించానన్నాడు. వాటిని ఉపయో గించి 5అడుగుల భారీ జ్యోతిని తయారు చేశానన్నాడు.



కౌన్సిల్ మీటింగ్ వాయిదా ఎందుకు..?

నవతెలంగాణ-సిద్దిపేట



కౌన్సిల్ మీటింగ్ ఎందుకు వాయిదా వేశారని, ఇష్టానుసారంగా అంచనా బిల్లులను మారుస్తూ ఎజెండా నివేదిక ఎందుకు ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ కౌన్సిలర్ రియాజ్, నాయకులు ఆనంద్‌లు బీఆర్ఎస్ కౌన్సిలర్లను ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల లేరు అని చెప్పి మున్సిపల్ సమావేశం రద్దు చేయడం జరిగిందని, చైర్ పర్సన్ అదుబాటులో లేకుంటే వైస్ చైర్మన్ జంగిటి. జంకరాజు ఉన్నారు కదా, వారు సమావేశానికి నడపరదా, చైర్ పర్సన్ పర్మిషన్ ఉంటేనే వైస్ చైర్మెన్ సమావే శానికి రావాలా అని ప్రశ్నించా రు. 43 మంది కౌన్సిల్లర్స్‌ని అవమా నించారని, మున్సిపల్ చైర్ పర్సన్ విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో వైస్ చైర్మెన్ మున్సి పల్ సమావేశం జరపడం జరిగిందని అన్నారు. వైస్ చైర్మన్‌తో సమావేశం జరపోచ్చు కాని జంగిటిపై నమ్మకం లేక సమావేశం రద్దు చేసారా అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పయ్యావుల. ఎల్లం, రియాజ్, ఎంఐఎం కౌన్సిలర్ అర్షద్ పాల్గొన్నారు.

టౌన్‌షిప్ అభివృద్ధి పేరుతో పేదల భూములు లాక్కోవడమేమిటి

- సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు
- ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండానే
- విలువైన భూములను కోల్పోతున్న రైతులు
- తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-పటాన్‌చెరు

టౌన్ షిప్ అభివృద్ధి పేరుతో పేదల భూములు లాక్కోవడం తో రైతులు తమ విలువైన భూములను కోల్పోతున్నారని సిపిఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు అన్నారు.పెద్దకంజర్ల గ్రామంలోని సర్వేనెంబర్ 121, 125 లలో గ్రామ రైతుల నుండి రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తున్న బలవంతపు భూసేకరణ ను వెంటనే నిలిపివేయాలంటూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పెద్ద కంజర్ల గ్రామ రైతులతో కలిసి మంగళవారం పటాన్‌చెరు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసిల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పెద్దకంజర్ల గ్రామంలోని సర్వే నెంబర్లు 120,, 121, 125 లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం



గ్రామ రైతుల నుండి దాదాపు 20 ఎకరాలను గత రాష్ట్ర ప్రభుత్వం టౌన్ షిప్ అభివృద్ధి పేరుతో భూసేకరణకు పూనుకున్నదని, ఒక ఎకరాకు 15 లక్షల 75 వేల రూపాయలను ప్రకటించి దాదాపు 100 మంది రైతులకు నష్టపరిహారం నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. గ్రామంలో కనీసం గ్రామ సభ కూడా నిర్వహించకుండా రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం బలవంతపు భూసేకరణ కార్యక్రమానికి సిద్దమైందన్నారు. ప్రస్తుతం హెచ్ఎండిఏ అధికారులు వచ్చి రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, హెచ్ఎండిఏ వారి చర్యల వలన రైతులు తమ విలువైన భూములను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు నష్టపరిహారం ఇచ్చేంతవరకు భూసేకరణను చేపట్టవద్దన్నారు. గతంలో సమస్య పరిష్కారం కోసం తహసిల్దార్, జిల్లా కలెక్టర్, మంత్రులకు విన్నవించడం జరిగిందన్నారు. సంవత్సరం గడుస్తున్న రైతులకు ఎందుకు నష్టపరిహారం చెల్లించడం లేదని ప్రశ్నించారు. వందమంది రైతులు పొజిషన్లో ఉండి పట్టా సర్టిఫికెట్లు కలిగి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నష్టపరిహారం చెల్లించడం లేదో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 2013 చట్టం ప్రకారము నష్టపరిహారం చెల్లించాలని లేదా భూమికి భూమి ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 300 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని లేనిపక్షంలో రైతులను పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు జంగయ్య,ముత్యాలు, నర్సింలు, దుర్గయ్య, నగేష్ నాగభూషణం రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రైతు వ్యక్తిగత పనులకు ప్రాధాన్యత

నవతెలంగాణ-నార్సింగి

ఉపాధి హామి పథకంలో భాగంగా మండల వ్యాప్తంగా జరిగిన పనుల గురించి స్థానిక ఎంపిడిఓ ఆనంద్, ఏపీఓ రాజేశ్వర్ గౌడ్ వివరించారు. ఎంపిడిఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 2616 ఆక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయని, 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం కలిపి 3.45 కోట్ల రూపాయలు వెచ్చించారని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు జీతాలుగా 2.8 కోట్లు చెల్లించగా, 65 లక్షలు పంచాయితీ రాజ్ పనులతో పాటు ఇతర సామాగ్రి కొరకు ఖర్చు జరిగిందన్నారు. ఉపాధి హామీ లో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం 60 శాతం రైతు వ్యక్తిగత వ్యవసాయ సంబంధిత



పనులైన పశువుల పాకల నిర్మాణం, పండ్ల తోటలు, భూమి అభివృద్ధి, మొక్కలు నాటడం, వెర్మి కంపోస్టు, నాడేప్ కంపోస్టు, ఇంకుడు గుంతలు లాంటి పనులు చేయడం జరిగిందని వివరించారు. చెరువులలో పూడిక తీత, అడవిలో కందకాల నిర్మాణం, కుంట కట్టల మరమ్మత్తు మిగిలిన 40 శాతంలో జరిగాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం రాబోవు ఆర్థిక సంవత్సరంలో కూడా 60 శాతం వ్యవసాయ సంభందిత రైతు వ్యక్తిగత పనులకు ప్రాముఖ్యత ఇస్తామని చెప్పారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి అక్టోబర్ 2 న నార్సింగి గ్రామ పంచాయితీలో నిర్వహించిన గ్రామ సభలో జరగాల్సిన పనుల బడ్జెట్, కార్మిక వ్యయం తయారు చేసి పనులకు సంబంధించి వివరాలు తెలియజేయడం జరిగిందన్నారు. దీంట్లో భాగంగా తొలి ప్రాధాన్యత గా వ్యయసాయ సంభందిత పనులకు రెండవ గ్రామ సభలు ప్రతి గ్రామ పంచాయితీ కార్యాలయాలలో జరిపి ప్రతిపాదించిన, జరగవలసిన పనులను తీర్మానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సయీద్, నార్సింగి పంచాయితీ కార్యదర్శి నాగభూషణం, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

ఎంపీడీవోకు వినతిపత్రం

నవతెలంగాణ-కౌడిపల్లి



గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం కౌడిపల్లి మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవో శ్రీనివాస్ కు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కౌడిపల్లి మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నాలుగు సంవత్సరాల కాలం పూర్తి చేసుకొని గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులు క్రమబద్ధీకరణ పొందిన వారికి సర్వీస్ కాలం పర్యవేస్తూ జీవో జారీ చేయాలని, క్రీడా కోటలు ఎంపికైన 98 మంది జిపిఎస్ లను తొలగించిన వారిని వీధిలో తీసుకోవాలని, విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు మరణిస్తే వారి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు రాజి రెడ్డి,కార్యవర్గ సభ్యులు రమేష్, సలీం, జ్యోతి, నర్సింలు, రత్నం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడల్లో మెదక్, హవేలి ఘనపూర్ మండలాల విజయం

నవతెలంగాణ-పాపన్నపేట

మండల కేంద్రమైన పాపన్నపేటలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ కబడ్డీ క్రీడోత్సవాలలో మెదక్, హవేలీ ఘనపూర్ మండలాలు మొదటి స్థానాల్ని దక్కించుకున్నాయి. మండల కేంద్రమైన పాపన్నపేట లో ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు బాలుర అండర్ 14 అండర్ 17 విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. అండర్ 14 విభాగంలో హవేలి ఘనపూర్ మండలం మొదటి స్థానం దక్కించుకోగా రెండో స్థానాన్ని నర్సాపూర్ చేజిక్కించుకుంది. ఇక అండర్ 17 కబడ్డీ విభాగంలో మొదటి స్థానాన్ని మెదక్ మండలం దక్కించుకోగా, రెండో స్థానాన్ని అల్లాదుర్గం మండలం కైవసం చేసుకుంది. మొదటి రోజు మెదక్ జిల్లా నుండి 20 మండలాల పరిధిలోని క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజైన బుధవారం అండర్ 14 అండర్ 17 విభాగంలో బాలికలకు కబడి పోటీలు జరుగుతాయని స్థానిక పీడీ రమేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమ నిర్వాహణకుగాను టెంట్లు, మైక్ సెట్‌లు స్థానిక నాయకులు నిటలక్షప్ప, గౌస్‌లు సమకూర్చరు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ జి వై సెక్రటరీ జి రమేష్, జిల్లా పేట సంఘం ప్రెసిడెంట్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, స్థానిక పీడీ రమేష్ పీడీలు ఎస్ చంద్రమోహన్ డి రవి మాధవ్ రెడ్డి, మధు సూదన్, కిరణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, అశోక్ , మహిపాల్, రాజేందర్, రూపేందర్ తదితరులు పాలుగోన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వంగా ఉంది

నవతెలంగాణ-వెల్దుర్తి



చిన్ననాటి నుంచి పదవ తరగతి వరకు మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదివి ఉన్నత చదువులు హైదరాబాదులో పూర్తి చేసుకొని మొదటిసారి నీటిలో మంచిర్యాంకుతో ఎంబీబీఎస్ సాధించినందుకు గర్వంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఎంఈఓ యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నీట్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించి గాంధీ నేచురపతి మెడికల్ కాలేజీలో గవర్నమెంట్ సీటు సాధించిన లక్ష్మి ప్రసన్నకు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ రాజకీయవేత్త కోదండ కృష్ణ గౌడ్ కుమార్తె లక్ష్మి ప్రసన్న ఎంబీబీఎస్ నేచురపతి మెడికల్ కాలేజీలో గవర్నమెంట్ సీటు సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక విద్యార్థి లక్ష్మీ ప్రసన్నను ఆదర్శంగా తీసుకొని ఒక లక్ష్యంతో చదివి ఆమె లాగానే డాక్టర్, ఇంజనీర్, కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ మాజీ చైర్మెన్ కర్రి వెంకటేశం, పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నవతెలంగాణ-మెదక్ రూరల్



మెదక్ మండల పరిధిలో గల మాచవరం గ్రామంలో మండలంలోని ప్రధానమైన వ్యవసాయ ఆధారిత గ్రామం వరిని అత్యధిక శాతం పైననే పండిస్తారు. వరి పంట చేతికొచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఈ సందర్భంలో దిక్కుతోచని పరిస్థితుల్లో ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1900 తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన దయనీయ పరిస్థితి వచ్చిందని స్థానిక సన్న కారు రైతు ఉగ్గి భూమయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

నర్సరీని ఆలయ ఆవరణలోకి తరలించిన అధికారులు

నవతెలంగాణ-నార్సింగి



రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపొందించడం కోసం గ్రామ గ్రామాన నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచడం, స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో గ్రామాలలో మొక్కలను నాటడం చేస్తుంది. నర్సరీల నిర్వహణ కోసం ప్రభుత్వ భూములను ఎంపిక చేసి నర్సరీలను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. నార్సింగిలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేనందున ఇది వరకు ప్రైవేట్ వ్యక్తికి చెందిన భూమిలో నిర్వహిస్తూ దాని అద్దెను గ్రామ పంచాయితీ భరిస్తూ వచ్చింది. నిధుల కొరత వల్ల అద్దె చెల్లించడం కుదరక పోవడంతో మండల కేంద్రంలోని శబరి మాతా ఆలయం కమిటీతో స్థానిక ఎంపీడీఓ ఆనంద్, ఏపీఓ రాజేశ్వర్, నార్సింగి పంచాయితీ కార్యదర్శి నాగ భూషణంలు సంప్రదించారు. గుడి ఆవరణలో ఖాళీ స్థానంలో నర్సరీ నిర్వహణ కోసం సహకరించాలని విజ్ఞప్తి చేయగా ఆలయ కమిటీ వారు సానుకూలంగా స్పందించడంతో మంగళవారం నర్సరీని అక్కడికి తరలించారు. ఈ సందర్భంగా అధికారులు ఆలయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

మండల కేంద్రంలో టపాకాయల దుకాణం

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో చుట్టూ ముట్టు గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ అనుమతులతో టపాకాయల దుకాణం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. దీపావళి పండుగను అందరూ ఆనందంగా నిర్వహించుకోవాలని సరసమైన ధరలకే లభించే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. పప్రతి ఒక్కరు దీపావళి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

వీరశైవ లింగాయత్ పేరుని వ్రాయించాలి

నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి జిల్లా వీర శైవ లింగాయత్ / లింగ బలిజ సంఘం అధ్యక్షులు పృధ్వి రాజు అధ్యక్షతన సమావేశము ఏర్పాటు చేసి, ప్రభుత్వం చేపట్టిన బిసి కుల గణన గురించి చర్చించారు. వీర శైవ లింగాయత్/లింగ బలిజ సంఘం తరుపున తమ కులము వీర శైవ లింగాయత్, లింగ బలిజ, లింగాయత్, బలిజ, శెట్టి బలిజ, గాండ్ల బలిజ, అను పేర్ల ను ప్రాంతాల వారీగా వివిధ పేర్లతో పిలువబడుచున్నాయన్నారు. ఈ కులము స్లీపింగ్. 46 గ్రూపు యందు 2009 సంవత్సరమున మన రాష్ట్ర ప్రభుత్వం జత చేయడం జరిగింది. కావున సంగారెడ్డి జిల్లాలో ఉన్నటి వంటి లింగాయత్‌లు ప్రభుత్వం చేపట్టే కుల గణనలో తప్పని సరిగాపైన తెలిపినట్టు కాకుండ అందరమూ ప్రభుత్వం ఇచ్చిన ప్రకారం వీరశైవ లింగాయత్/లింగ బలిజ అనే పేరుని వ్రాయించాలని కోరారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు ధనంజయ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునపాటిల్, కోశాధికారి గోవురాజు, ముఖ్య సలహా దారులు శివకుమార్, ఉపాధ్యక్షులు సంగిశెట్టి, అమర్నాథ్ సెక్రటరీ లు, శివకుమార్, గౌలిశ్వర్, నాగన్న, చెంద్రశేఖర్, మల్లికార్జునశెట్టి పాల్గొన్నారు.

